ఏపీ మోడల్ స్కూల్‌ను ఎంఈఓ పరిశీలన

విశాలాంధ్ర-తెర్లాం : మండలంలో ఎమ్ఈఓ జే.త్రినాధరావు పెరుమాలి ఏపీ మోడల్ స్కూల్‌ను పరిశీలించారు. 01.03.25 నుంచి 15.03.25 వరకు జరిగే ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం, ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరిగే పరిక్ష కేంద్రాలను పరిశీలించి విద్యార్థులకు బెంచ్‌లను ఏర్పాటు చేశారు. ప్రథమసంవత్సరం పరీక్షలు వ్రాయడానికి 377 మంది విద్యార్థులు మరియు ద్వితీయ సంవత్సరం పరీక్షలు వ్రాయడానికి 188 మంది విద్యార్థులు మొత్తం 565 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయనున్నారు తెలిపారు. ఉదయం 8:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు అని, పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ఆదేశాలు జారీ చెయ్యడం జరిగింది అని విలేకర్లతో ఎమ్ఈఓ జే.త్రినాధరావు తెలిపారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

విశాలాంధ్ర-భోగాపురం : కొంగవాని పాలెం ప్రాథమిక పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రఖ్యాత భారత భౌతిక శాస్త్రవేత్త సర్ సి.వి రామన్, రామన్ ఎఫెక్ట్ కనుగొన్న సందర్భంగా ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటుచేసిన వైజ్ఞానిక ప్రదర్శనను మండల విద్యాశాఖ అధికారి-2 బాలిపల్లి చంద్రమౌళి ముఖ్యఅతిథిగా హాజరయ్యి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో చిన్ననాటి నుంచే శాస్త్రీయ అవగాహన ను పెంచి, నిత్యజీవితంలో విజ్ఞాన శాస్త్ర ప్రాముఖ్యతను తెలియజేసి, నూతన ఆవిష్కరణలకు ప్రేరేపించుట కోసం ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని , గ్రామంలోని బడి ఈడు గల పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. ఈ వైజ్ఞానిక ప్రదర్శనలో విండ్ మిల్, సోలార్ సిస్టం, చంద్రయాన్-3, అడవుల సంరక్షణ, వాతావరణం మార్పు, వాల్కనో, స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర , వాటర్ ప్యూరిఫికేషను మొదలగు 20 వరకు ప్రాజెక్టులను పాఠశాల విద్యార్థులు ప్రదర్శించి, వాటి గురించి వివరించారు. ప్రదర్శనలో ఉత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేసి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేసి విద్యార్థులను అభినందించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆళ్ల వెంకటేష్, ఉపాధ్యాయులు పబ్బిరెండి. శివప్రసాద్, జి. మిన్నారావు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముక్కాం ప్రధానోపాధ్యాయులు జి.నర్సింగరావు, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, బమ్మిడిపేట ఉపాధ్యాయులు కె.రామచంద్రరావు, ఎన్.నారాయణమూర్తి, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్పర్సన్ కె.ఉమ తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బియ్యం బస్తాల లోడుతో వస్తున్న లారీలు నిలిపివేత

- సిఐ సమక్షంలో కాంట్రాక్టర్లతో చర్చల అనంతరం సమస్య పరిష్కరిస్తాం
- ఎమ్మెల్యే హామీతో కళాసీ కార్మికుల నిరసన విరమణ

విశాలాంధ్ర-బొబ్బిలి : దాదాపు 40 సంవత్సరాల నుంచి బొబ్బిలి రైల్వే వేగన్ పాయింట్ వద్ద బొబ్బిలి కళాసీ కార్మికులు లోడింగ్, అన్లోడింగ్ పనులు చేస్తు జీవనం సాగిస్తున్నామని, వేర్ హౌసింగ్ గోడౌన్స్ నుంచి వ్యాగన్ పాయింట్‌కు లోడింగ్, అన్ లోడింగ్‌పై ప్రతి రెండు సంవత్సరాలకు కాంట్రాక్టర్‌తో కళాశీలకు ఒప్పందం జరుగుతుందని, ప్రస్తుత ఒప్పందం ఈ సంవత్సరం డిసెంబర్ వరకు అమలులో ఉంటుంది. మూడు లైన్ల పనిలో భాగంగా వేగన్ పాయింట్‌ను బొబ్బిలి నుంచి కోమటిపల్లికి మార్పు చేశారు. కొత్తగా కోమటిపల్లిలో ఏర్పాటు చేసింది కాదని, పరిస్థితి ఇలా ఉన్నది. కానీ వ్యాగన్ లోడింగ్, అన్లోడింగ్, ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్‌గా ఉన్న వ్యక్తి ఈ కళాశీలను పక్కనపెట్టి కొత్త గా స్థానిక వ్యక్తులను పెట్టుకుంటానని, బొబ్బిలి కళాసీ కార్మికులు పనికి రావద్దని అడ్డుకోవడం ధర్మం కాదని పట్టణ కళాసి సంఘం నాయకులు దంతులూరి వర్మ ఆధ్వర్యంలో పట్టణ కళాసీ సంఘం నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణ కళాసీ కార్మికులు సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రజాసంఘాల నాయకులు అని చెప్పుకుంటున్న కొందరు జనాలను రెచ్చగొట్టి 365 రోజులు పని ఇప్పిస్తామని చెప్పి అబద్ధం ప్రచారం చేస్తున్నారని, నిజానికి సంవత్సరంలో పాతిక నుంచి 30 వేగన్లు మాత్రమే పెట్టడం జరుగుతుందని. అక్కడ స్థానికంగా ఉన్న వ్యక్తులను పెట్టుకుని కూలీరేట్లను తగ్గించి డబ్బులు మిగిలించుకుందామని దురుద్దేశంతో కాంట్రాక్టర్ వ్యవహరిస్తున్నారని కాంట్రాక్టర్ తీరుపై మండిపడ్డారు. 40 సంవత్సరాల నుంచి పనిచేస్తున్న కళాసీ కార్మికులకు న్యాయం చేసి ఉపాధిని కల్పించాలని డిమాండ్ చేస్తూ బొబ్బిలి గ్రోత్ సెంటర్ వద్ద వేర్ హౌసింగ్ గోడౌన్‌ల నుంచి బియ్యం బస్తాల లోడుతో వెళ్తున్న లారీలను వందలాది మంది కళాసీ కార్మికులు లారీలను అడ్డుకొని సమస్య పరిష్కారం అయ్యేంతవరకు వీటిని కదలనివ్వమని, పెద్ద ఎత్తున పట్టణ కళాసి సంఘం నాయకులు కార్మికులు ఆందోళన చేపట్టారు. అధికారుల స్పందించి తమకు న్యాయం చేయాలని కళాసీ కార్మికులు డిమాండ్ చేశారు. పట్టణ సీఐ సతీష్ కుమార్ సమక్షంలో కార్మిక సంఘ నాయకులతోనూ కాంట్రాక్టులతో చర్చలు జరిపారు. ఎమ్మెల్యే బేబీ నాయన కళాసీ కార్మికులు సమస్యలు స్పందించి అసెంబ్లీ సమావేశాలు అయిపోయిన వెంటనే కార్మికుల న్యాయంకోసం చర్చలు జరుపుతామని ప్రస్తుతం నిలుపుదల చేసిన లారీలను కార్మికులు విడిచిపెట్టాలని సమస్త పరిష్కారం అయ్యేవరకు ఎటువంటి లోడింగ్ అన్లోడింగ్ చేయవద్దని కాంట్రాక్టు కర్మికులు అగ్రిమెంట్ రాసుకొని ఆందోళన విరమించారు. ఈ ఆందోళన కార్యక్రమంలో పట్టణ కళాసీ సంఘం అధ్యక్షుడు బోగాది అప్పలస్వామి, కార్యదర్శి దంతులూరి వర్మ, (కార్యదర్శి), పిరిడి అప్పారావు(ఉపాధ్యక్షులు), సహాయ కార్యదర్శి ఎర్రబాల అప్పారావు, పైల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభివృద్ధి బడ్జెట్ అని జిల్లా మంత్రి, ఎమ్మెల్యేలు ప్రశంసలు గుప్పించడం సిగ్గు చేటు

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్ : 2025-26 ఆర్థిక సంవత్సరానికి 3,22,359 కోట్లతో నేడు అసెంబ్లీలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టిన రాష్ట్ర బడ్జెట్ ద్వారా రాష్ట్ర ప్రజల అరచేతిలో వైకుంఠం చూపించే ప్రయత్నం చేశారని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ విమర్శించారు. బడ్జెట్ ప్రసంగం మొదట్లోనే ఆర్థిక మంత్రి రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం జరిగిందని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాలేదని చెబుతూనే ఈ బడ్జెట్ మొత్తాన్ని అధికంగా చూపి మొత్తానికి అంకెలతో గారడీ ప్రదర్శించారు. ద్రవ్య లోటు రూ.68,742.65 కోట్లుగా, రెవెన్యూ లోటు రూ.34,712.84 కోట్లుగా చూపారు. ఈలోటును ఏ రకంగా భర్తీ చేస్తారో చెప్పలేదు. నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రణ పై ఊసేలేదు, విద్యుత్ రంగం విషయంలో ప్రజల పైన భారాలు పడుతున్నాయి కాబట్టి విద్యుత్ భారాలు మోపకుండా పరిష్కారం చూపలేకపోయారన్నారు. విద్య రంగానికి పాఠశాల విద్యకు 31,805 కోట్లు, ఉన్నత విద్యకు 2,506 కోట్లు మాత్రమే కేటాయించడం దుర్మార్గమన్నారు. కొఠారి కమిషన్ నివేదిక ప్రకారం రాష్ట్రంలో విద్య వ్యవస్థ అభివృద్ధి చెందాలంటే రాష్ట్ర బడ్జెట్లో 30% నిధుల కేటాయించాలని చెబితే రాష్ట్ర ప్రభుత్వం కేవలం 11 శాతం నిధులు కేటాయించి విద్యాభివృద్ధి గురించి గొప్పలు చెప్తే సరిపోదని దుయ్యబట్టారు. ప్రపంచంలోనే అత్యంత ప్రమాణాలు కలిగిన 100 విశ్వవిద్యాలయాలు ఉన్నాయని, ఆ స్థాయిలో విద్యా ప్రమాణాలు పెంచుతామని చెబుతూ, గొప్పలు చెప్పే చంద్రబాబు నాయుడు ఉన్నత విద్యకు కేవలం 2,506 కోట్ల నిధులు ఏమాత్రం సరిపోతాయని అశోక్ ప్రశ్నించారు. నిరుద్యోగులకు ఎన్నికలకు ముందు ప్రతి ఒక్కరికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, 5000 రూపాయిలు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి బడ్జెట్ సమావేశాల్లో నిరుద్యోగ భృతికి నిధులు కేటాయించకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో పూజారులకు, ఇమాములకు, అర్చకులు, పాస్టర్లకి నెలకు 15000 ఇచ్చే రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కష్టపడి చదివిన చదువుకు ఉద్యోగం దొరకక ఉద్యోగ అవకాశాల కోసం వేచి చూసే నిరుద్యోగులకు ఉద్యోగాలు కలిపించక, నిరుద్యోగ భృతి కేటాయించకపోవడం సిగ్గుచేటు అన్నారు. రాష్ట్రంలో 1 లక్షా అరవై వేల మంది వాలంటీర్లకి 9 నెలలుగా గౌరవ వేతనాలు చెల్లించకుండా వాళ్ళ బ్రతుకులు రోడ్డున పడేసిన పాపం కూటమి ప్రభుత్వానిదే అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వలసల నివారణకు చర్యలు చూపించలేదు అని అన్నారు. వ్యవసాయరంగాన్ని అభివృద్ధిపై మాటలు లేవన్నారు. కౌలు రైతుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలేదన్నారు. కార్మికవర్గాన్ని విస్మరించారు. జిల్లాలో మూతపడిన పరిశ్రమలు తెరవడానికి, కొత్త పరిశ్రమలకి తేవడానికి మాటలు లేవు, జిల్లాలో పెండింగులో ఉన్న నీటి ప్రాజెక్టులు పై మాటలు లేవు, మెడికల్ కాలేజ్ నిర్మాణం పూర్తికి మాటలు లేవు, జిల్లాలో ప్రభుత్వ వైద్య శాలలు మెరుగు కోసం మాటలు లేవు. రాష్ట్ర బడ్జెట్లో జిల్లా సమగ్ర అభివృద్ధికి ఎలాంటి కేటాయింపులు లేకపోయినా స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రి, ప్రజాభివృద్ధి బడ్జెట్ అని ప్రశంసలు గుప్పించడం చాలా సిగ్గు చేటు అని విమర్శించారు.

పరిశుభ్రత ఆధారంగా హోటళ్లకు స్వచ్ఛత గ్రీన్‌లీఫ్ రేటింగ్

జిల్లా పర్యాటకాధికారి కుమారస్వామి

విశాలాంధ్ర-విజయనగరం రూరల్ : మెరుగైన పారిశుధ్య నిర్వహణ, పరిశుభ్రత ఆధారంగా హెటళ్లు, రెస్టారెంట్లు, లాడ్జిలు, ధర్మశాలలకు స్వచ్ఛత గ్రీన్‌లీఫ్ రేటింగ్ ఇవ్వడం జరుగుతుందని జిల్లా పర్యాటక శాఖాధికారి కె.కుమారస్వామి చెప్పారు. ఆయా ఆతిథ్య సంస్థలు అవలంభించే నూతన పారిశుధ్య విధానాలు, నిర్వహణ ఆధారంగా ఒన్ లీఫ్, త్రి లీఫ్, ఫైవ్ లీఫ్ రేటింగ్ ఇస్తారని తెలిపారు. స్వచ్ఛత గ్రీన్‌లీఫ్ రేటింగ్ విధానంపై హెటళ్లు, రెస్టారెంట్లు, లాడ్జిల యజమానులకు స్థానిక మయూర హెటల్‌లో శుక్రవారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో డిటిఓ కుమారస్వామి మాట్లాడుతూ, రేటింగ్ ఇచ్చే విధానాలను వివరించారు. ఈ రేటింగ్‌కు ఆయా ఆతిథ్య సంస్థల మెరుగైన, ఆధునిక నిర్వహణా విధానాలనే ప్రాతిపదికగా తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ రేటింగ్ సాధించేందుకు పాటించాల్సిన నిబంధనలు, కావాల్సిన మౌలిక వసతులు, నిర్వహణ, ఆధునిక సాంకేతికతను అవలంభించడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఘనవ్యర్థాల నిర్వహణ, మురుగునీటి నిర్వహణ, మానవ వ్యర్థాల నిర్వహణపై దృష్టిపెట్టి ఆధునిక విధానాలను పాటించాల్సిన అవసరం ఉంటుందని చెప్పారు. డివిజన్ స్థాయి కమిటీల తనిఖీల అనంతరం, జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా ఉన్న జిల్లా కమిటీ ఈ రేటింగ్‌ను ప్రకటిస్తుందని తెలిపారు. అతిథులను ఆకర్షించేందుకు ఈరేటింగ్ ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. బయో టెక్నాలజిస్ట్ డాక్టర్ శరత్ మాట్లాడుతూ, మురుగునీరు, ఘన వ్యర్థాల నిర్వహణకు అవలంబించాల్సిన సాంకేతిక పద్ధతులను వివరించారు. అతితక్కువ స్థలంలో, తక్కువ ఖర్చుతో అత్యంత సులువుగా అవలంభించే పర్యావరణ అనుకూలమైన విధానాలపై అవగాహన కల్పించారు. వీటి నిర్వహణకు ప్రస్తుతం ఎంతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ప్రస్తుతం అందుబాటులో ఉందని, దీనిని వినియోగించుకోవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ పి.నల్లనయ్య మాట్లాడుతూ, మురుగునీరు, చెత్తశుద్దికి పాటించాల్సిన విధానాలను తెలిపారు. ఈఅవగాహనా కార్యక్రమంలో డిపిఓ టి.వెంకటేశ్వరావు, జెడ్పి సిఈఓ వెంకటరామన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కవిత, ఇతర అధికారులు, వివిధ హెటళు ,, రెస్టారెంట్ అసోసియేషన్ల నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపారు... రూ.10వేలు జరిమానా చెల్లించారు

జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ వెల్లడి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : మద్యం సేవించి వాహనాలు నడిపి, పట్టుబడితే.. నేరాన్ని న్యాయ స్థానాలు తీవ్రమైన పరిగణించి, ఇటీవల కాలంలో వాహనదారులు ఒక్కొక్కరికి రూ.10వేలు జరిమానా విధిస్తున్నారని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. జిల్లాలో మద్యం సేవించి వాహనాలు నడిపిన వాహనదారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్పీ ఆదేశాలతో విజయనగరం ట్రాఫిక్ సిఐ సూరి నాయుడు ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు ఫిబ్రవరి 25, 27 తేదీల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఈ ప్రత్యేక డ్రైవ్లో ఫిబ్రవరి 25న 15మంది, ఫిబ్రవరి 27న 9మంది మద్యం సేవించి, వాహనాలు నడుపుతూ ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడ్డారన్నారు. వీరిని విజయనగరం అడిషనల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వద్ద హాజరుపర్చగా, ఎ.జె.ఎఫ్.సి.ఎం. మెజిస్ట్రేట్ బి.రమ్య ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున మొత్తం రూ.2.40 లక్షలను జరిమానగా విధించారని తెలిపారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే ప్రమాదాలకు గురవ్వడం లేదా ఇతర వాహనాలను ఢీకొట్టి ప్రమాదాలకు కారకులవుతున్నారన్నారు. ఈతరహా వాహనదారులను కట్టడి చేసేందుకు, ప్రమాదాలను నియంత్రించేందుకు ప్రతీరోజూ నిర్వహిస్తున్న విజిబుల్ పోలీసింగులో భాగంగా ప్రత్యేకంగా డ్రంకన్ డ్రైవ్ చేపట్టి, డ్రంకన్ డ్రైవ్ తనిఖీలుచేపడుతూ, మద్యం సేవించి, వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదుచేస్తున్నామన్నామన్నారు. ఈ సంవత్సరం జిల్లాలో ఇంత వరకు మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై 983కేసులు, ఓపెన్ డ్రింకింగు చేస్తూ పట్టుబడిన వారిపై 3,570కేసులు నమోదు చేసామని తెలిపారు.

రాజాంలో యువకులను కిడ్నాప్ చేసి... దాడి

విశాలాంధ్ర-రాజాం : రాజాంలో గురువారం రాత్రి దారుణ ఘటన చోటు చేసుకుంది. పాత కక్షల నేపథ్యంలో ఇద్దరు యువకులను రాజాం పట్టణానికి చెందిన కొంత మంది కిడ్నాప్ చేసి నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లారు. యువకులను కట్టేసి దారుణంగా కొట్టారు. ఈ దాడిలో విజయ్, తేజ అనే ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన ఇద్దరూ రాజాం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఘటనపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర బడ్జెట్ : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్ : రాష్ట్ర శాసనసభలో శుక్రవారం ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉందని శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు అన్నారు. గత వైసిపి ప్రభుత్వ విధ్వంసకర పాలన వలన రాష్ట్రం ఎన్ని కష్టాలలో ఉన్నప్పటికీ, స్వర్ణాంధ్ర సాధనగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ఉందని అన్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలుకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం ప్రభుత్వం యొక్క చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. డీఎస్సీ ఉద్యోగాలు, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, దీపం-2 ఇలా అనేక పథకాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించారని తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల సంక్షేమానికి అధిక నిధులు కేటాయించారని అన్నారు. అదేవిధంగా వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రవేశపెట్టిన వ్యవసాయ బడ్జెట్‌లో వ్యవసాయ అనుబంధ రంగాలకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించడం హర్షించదగ్గ విషయం అన్నారు.

మానాపురం ఆర్.ఓ.బి పనులు వేగవంతం కావాలి

కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్

విశాలాంధ్ర-విజయనగరం : మానాపురం రైల్ ఓవర్ బ్రిడ్జి ను ఏప్రిల్ నెల నాటికి ప్రారంభం అయ్యేలా పనులు వేగవంతం కావాలని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. శుక్రవారం అయన ఛాంబర్ లో నేషనల్ హై వే, ఆర్ అండ్ బి అధికారులు, కాంట్రాక్టర్లతో ఆర్.ఓ.బి పనులపై కలెక్టర్ సమీక్షించారు. గత శుక్రవారం వరకు 81 శాతం పనులు పూర్తయ్యాయని, ఈ శుక్రవారం కు 82.06 శాతం పూర్తయ్యాయని , నెమ్మదిగా జరుగుతున్నాయని అసహనం వ్యక్తం చేశారు. మార్చి లోపల మిగిలిన 18 శాతం పూర్తి చేసి ఏప్రిల్ 1 నాటికి ప్రారంభించడానికి సిద్ధం చేయాలనీ ఆదేశించారు. 2021 లో పనులు ప్రారంభం అయ్యాయని, 2023 జనవరి నాటికీ పూర్తి చెయ్యవలసి ఉందని, ఇప్పటికే ఆలస్యం అయ్యిందని, ఇక పై వారం వారం సమీక్ష చేస్తానని, పనుల్లో పురోగతి కనపడాలని ఆదేశించారు. మార్చి 1 నుండి 31 వరకు వారం వారం లక్ష్యాలను నిర్దేశించాలని, ప్రాధాన్యత వారీగా పనులు చేయడానికి కార్యాచరణ ప్రణాళికను తయారు చెయ్యాలని ఆర్ అండ్ బి ఎస్.ఈ కు ఆదేశించారు. మార్చి 31 నాటికి పనులన్నీ పూర్తి కావాలని, ఏప్రిల్ నుండి ఎట్టి పరిస్థితుల్లో ప్రారంభం కావాలని తెలిపారు. గుంతలు లేని రహదారుల నిర్మాణం లో భాగంగా మొదటి దశ క్రింద రెండవ, మూడవ దశలలో మంజూరైన 100 పనులకు గానూ 15 పనులు పెండింగ్ ఉన్నాయని, వాటిని కూడా వేగంగా పూర్తి చేయాలనీ అధికారులకు ఆదేశించారు. పూర్తి చేసిన పనులకు సంబంధించిన బిల్లులను అప్లోడ్ చేయాలనీ అన్నారు. ఈ సమావేశంలో , ఆర్. అండ్ బి ఏస్.ఈ కాంతిమతి, డి.ఈ.లు, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

లెప్రసీ బాధితుల అంగవైకల్యం నివారణకు రూ.9486 విరాళం

విశాలాంధ్ర-గరివిడి : విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవ అలవర్చుకోవాలని హెచ్ఎం డి రాము అన్నారు .మండలం లో కాపు శంభాం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం లెప్రసి బాధితుల అంగవైకల్యం నివారణకు రూ.9486 విరాళం అందించారు. ఈ మొత్తాన్ని లెప్రా సొసైటీ ఫండ్రైసింగ్ ఎక్సక్యూటివ్ లెంక రమణకు హెచ్ఎం డి రాము అందజేశారు. హెచ్ ఎం మాట్లాడుతూ వ్యాధిగ్రస్తులకు సహాయ సహకారాలు అందించిచడానికి దాతలు ముందుకు రావాలని కోరారు. వారిపై వివక్ష చూపకుండా ప్రేమతో ఆదరించాలని చెప్పారు. లెంక రమణ మాట్లాడుతూ జిల్లాలో లెప్రా సొసైటీ జిల్లా ప్రభుత్వ మహారాజ ఆసుపత్రిలో జిల్లా కుష్ఠు నివారణ అధికారి సహకారంతో బాధితులకు అంగవైకల్యం నివారణకు రిఫరెల్ సెంటర్ ద్వారా సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా కుష్ఠువ్యాధి బాధితులకు ఉచితంగా ప్రత్యేక పాదరక్షలు, సెల్ఫ్ కేర్ కిట్లు, ఫిజియో థెరపీ సేవలు అందించనున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా దాతలు నుండి విరాళాలు సేకరిస్తున్నట్లు చెప్పారు.

కనకమహాలక్ష్మి అమ్మవారి జాతరలో ప్రజలకు ఉచిత దర్శనం : ఈవో

విశాలాంధ్ర-చీపురుపల్లి : ఈనెల రెండు మూడు నాలుగు తేదీలలో అత్యంత వైభవపేతంగా జరగనున్న శ్రీ శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర మహెూత్సవాల్లో ప్రజల సౌకర్యార్థం ఉచిత దర్శనం అవకాశాన్ని కల్పిస్తున్నట్లు ఈవో శ్రీనివాస్ తెలిపారు.. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఇటీవల పని పత్రికలలో ప్రజలకు ఉచిత దర్శనం లేనట్లు వార్తలు ప్రచురితమైనట్లు ఆయన తెలిపారు. ఆలయ కమిటీ, స్థానిక పెద్దలు, ప్రజా ప్రతినిధులు, అభీష్టమ మేరకు ప్రజలకు ఉచిత దర్శన అవకాశాన్ని కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు ఆలయ ప్రాంగణం వద్ద ఉచిత దర్శనం క్యూలైన్లను ఏర్పాటు చేయనున్నామని ఆయన అన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకొని అమ్మవారి జాతరను విజయవంతం చేసేందుకు అందరు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు. అలాగే ఆలయం వద్ద అమ్మవారి దర్శనార్థం వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

మున్సిపల్ కార్మికుల పోరాటానికి సంపూర్ణ మద్దతు

రౌండ్ టేబుల్ సమావేశంలో రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నేతలు ప్రకటన

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్ : మున్సిపల్ కార్మికులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను పరిష్కారం కోసం పోరాటాలకి సంపూర్ణ మద్దతు తెలియ చేస్తున్నమని శుక్రవారం స్థానిక డి.ఎస్.ఆర్ అమర్ భవన్ లో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎస్ రంగరాజు అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, వైసిపి పట్టణ అధ్యక్షుడు ఆశపు వేణు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కరీం, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు కోటేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డేగల అప్పలరాజు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పురం అప్పారావు, ఎ.పి క్లాప్ వెహికల్ డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పొడుగు రామకృష్ణ, అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) జిల్లా అధ్యక్షుడు బూర వాసు, ఉపాధ్యక్షుడు వెలగాడ రాజేష్ మొదలైన ప్రజా సంఘాలు నేతలు తెలిపారు. మున్సిపల్ కార్మికులు గత సమ్మె కాలంలో ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందం ప్రకారం కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని ఆప్కాస్ ను రద్దు చేస్తే కార్మికుల జీతభత్యాల బాధ్యత మున్సిపాలిటీలు తీసుకోవాలని అన్నారు. కార్మికులను పర్మినెంట్ చేయాలని అన్నారు. సెలవులు విధుల అప్పగింత ప్రైవేటు ఏజెన్సీలకు ఇచ్చే ఆలోచనలు విరమించుకోవాలని. పెరుగుతున్న జనాభా కనుగునంగా కార్మికుల సంఖ్యను పెంచాలని కాంట్రాక్ట్ కార్మికుల రిటైర్మెంట్ వయసును 62 ఏళ్లకు పెంచాలని తదితర డిమాండ్ల సాధన కొరకు ఈ నెల 17వ తేదీ నుండి దశలో వారి ఆందోళన కొనసాగిస్తున్నామని మార్చ్ 3వ తేదీన కలెక్టర్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున కార్మికులతో ధర్నా నిర్వహిస్తున్నామని అనంతరం మార్చ్ 6వ తేదీన చలో విజయవాడ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమాలన్నిటికీ సంపూర్ణ మద్దతు తెలియచేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎ.పి మున్సిపల్ వర్కర్స్ యూనియ జిల్లా ప్రధాన కార్యదర్శి జలగడుగుల కామేష్, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు తుపాకుల శ్రీను, కార్యదర్శి కళ్యాణం శ్రీను, కార్యదర్శి దలాయ శ్రీను, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

202 పశువుల అక్రమ రవాణాను అడ్డుకున్న పోలీసులు

కబేలాకు తరలించేందుకు సంతపాలెంలో పశువుల్ని నిర్బంధించిన దుండగులు

విశాలాంధ్ర-కొత్తవలస : అభం శుభం ఎరుగని మూగజీవాల్ని కబేలాకు తరలించి సొమ్ము చేసుకుందా మనుకునే అక్రమార్కుల ఆట కట్టించారు. కొత్తవలస పోలీసులు పశువులను భారీ ఎత్తున అక్రమంగా కబేలాకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారనే ఖచ్చితమైన సమాచారంతో.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొత్తవలస సిఐ షణ్ముఖరావు తన సిబ్బందితో శుక్రవారం సంతపాలెం గ్రామంలో దాడులు నిర్వహించారు. షణ్ముఖరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తవలస మండలంలోని సంతపాలెం గ్రామ శివారులో గల మామిడి తోటల్లో సుమారు 202 పశువులను గ్రామానికి చెందిన గొట్టివాడ ఎన్నిబాబు అనే వ్యక్తి నిర్బంధించి, పసుమాంస విక్రయానికి తరలించేందుకుగాను సిద్ధమైనట్లు పోలీసులకు వచ్చిన ఖచ్చితమైన సమాచారంతో శుక్రవారం దాడులు నిర్వహించామన్నారు. దుండగుల నుంచి కాపాడిన పశువులను ప్రస్తుతం సురక్షిత ప్రాంతానికి చేర్చి వాటికి నీరు, గడ్డి అందించి సంరక్షించినట్లు తెలిపారు. అనంతరం పశుసంవర్ధక శాఖ అధికారులకు సమాచారం అందించారు. 202 పశువుల ఆరోగ్య పరిస్థితిపై పరిశీలించి నివేదిక అందిస్తామని పశువైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ విలేకరులకు తెలిపారు. ఈ అక్రమ రవాణాలో మరింతమంది అక్రమార్కులు ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. పశురవాణా, కాబేలా వంటి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరిస్తున్నారు.

బడ్జెట్‌లో జిల్లాకు మొండిచేయి చూపారు

సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ

విశాలాంధ్ర - విజయనగరం : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విజయ నగరం జిల్లాకు పూర్తిగా మొండి చేయి చూపారని సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మిరమణ అన్నారు. అత్యంత వెనుకబడిన జిల్లాలో ప్రాజెక్టులు పూర్తికాకుండా ఉండిపోయాయని, వాటిని పూర్తిచేసే హామీలు ఇవ్వలేదన్నారు. అలాగే జిల్లా సమగ్ర అభివృద్ధికి తగిన నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. ఎన్నికలకు ముందు కూటమి తరుపున ఇచ్చిన హామీలలో ప్రధానమైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 18ఏళ్ళు దాటిన మహిళలకు నెలవారీ వేతనంపై తెలియజేయలేదన్నారు. జిల్లాలో మూతబడిన పరిశ్రమలను తెరిపించేందుకు తగిన కృషి చేయలేదని ఆరోపించారు. బడ్జెట్‌లో జిల్లాకు తగిన న్యాయం చేయలేకపోయారని, స్థానిక ఎమ్మెల్యేలు, జిల్లా మంత్రి సంయుక్తంగా తగిన నిధులు రాబట్టేలా కృషి చేయాలన్నారు.

ముంజేరులో రాళ్ళ చెరువు ఆక్రమణ

విశాలాంధ్ర-భోగాపురం : మండలంలోని ముంజేరు గ్రామ రెవెన్యూ పరిధిలోని రాళ్లచెరువు ఆక్రమణపై గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. చెరువు గర్భాన్ని సుమారు ఎకరా వరకు ఆక్రమించి శుక్రవారం ఫెన్సింగ్ వేస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. దీనిపై గ్రామస్తులు కొంతమంది వెళ్లి అక్రమదారున్ని ప్రశ్నించారు. అనంతరం అధికారులకు సమాచారం ఇచ్చారు. శనివారం నేరుగా రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు తెలిపారు.

ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర-బాడంగి : ఇంటర్ ప్రథమ ద్వితీయ సంవత్సర పబ్లిక్ పరీక్షలకు ఏర్పాటు చేశామని జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ విజయకుమరి తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు శనివారం నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయని అన్నారు. రామభద్రపురం , బాడంగి, దత్తిరాజేరు మండలాల్లో ఉన్న కస్తూరిబాయి, గురుకులం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షలు వ్రాస్తారని తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం 388 విద్యార్థులు, ద్వితీయ సంవత్సరంకు సంబంధించిన 400 మంది విద్యార్థులు బాడంగి పరీక్ష కేంద్రంలో పరీక్షలు రాస్తారని ఆమె తెలిపారు. ఈపరీక్ష కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్‌గా విజయ్‌కుమారి, డిపార్ట్మెంట్ ఆఫీసర్ గా భాస్కర్ రావును నియమించారు.

రాజాం : రాజాంలో ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్న కేంద్రాల వద్ద 144 వ సెక్షన్ నిషేధాజ్ఞలు అమలులో ఉన్నాయని సీఐ అశోక్ కుమార్ తెలిపారు. ఇద్దరు కన్నా ఎక్కువ మంది ఉంటే వారిపై చర్యలు తీసుకోవడం జరుగు తుందన్నారు. పరీక్షలు జరుగుతున్న ఉదయం 9 నుంచి 12గంటల వరకు కేంద్రాల పరిసరాల్లో గాని, టౌన్ లోగాని ఎక్కడైనా జిరాక్స్ షాపులేవీ తెరిచి ఉంచడానికి వీల్లేదని ఆదేశించారు. ఎవ్వరైనా షాపు తెరిచి ఉంచితే, వారిపై చర్యలు తప్పవని స్పష్టం చేసారు.పరీక్షా కేంద్రాల సమీపంలో ఎటువంటి 'శబ్దాలు' చేయడానికి వీల్లేదని చెప్పారు. ఫంక్షన్లు జరుపుకునేవారు తప్పనిసరిగా ఈ నిబంధనలు పాటించాలన్నారు. 'మైక్'లకు ఎటువంటి అనుమతి లేదన్నారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలిగించ దానికి వీల్లేదన్నారు.ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసుల పెట్రోలింగ్ జరుగుతుందని చెప్పారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల వద్ద ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. అనుమానస్పద వ్యక్తులు సంచరిస్తే స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఇంటి పేరు మార్పు

నా విద్యా రికార్డుల ప్రకారం నా ఇంటిపేరు గుంట (గుంట దిలీప్) కానీ, నా వ్యక్తిగత కారణాల వలన నేను నా పేరును బొంతు దిలీప్‌గా మార్చుకుంటున్నాను. కాబట్టి నాపేరును గుంట దిలీప్ నుండి బొంతు దిలీప్‌గా మార్చబడుచున్నదని పత్రికాముఖంగా తెలియజేయుచున్నాను. ఈప్రకారం నా పేరును బొంతు దిలీప్‌గా అన్ని విద్యాపరమైన మరియు ఇతర సంబంధిత రికార్డులలో, అనగా, ఎస్ఎస్‌సీ రోల్ నెం.1105103173, డిప్లొమా పాలిటెక్నిక్ శాశ్వత గుర్తింపు నెం. 13180-ఎం-037, బీటెక్ నెం.166బి 5ఏ 0315, ఇతర రికార్డులలో కూడా మార్చుకొనుచున్నాను.

ఇట్లు
బొంతు దిలీప్,
కింజంగి గ్రామం, వంగర మండలం,
విజయనగరం జిల్లా.

108 సిబ్బందికి అలుబిల్లి శ్రీనివాసరావు శిక్షణ

విశాలాంధ్ర-రాజాం : విజయనగరం జిల్లా రాజాం ప్రాంతీయ ఆసుపత్రి ఆవరణలో 108 అంబులెన్సు లో పనిచేసే మెడికల్ టెక్నీషియన్ లకు రిఫ్రెషర్ తరగతులు ఓజెటి అలుబిల్లి. శ్రీనివాసరావు నిర్వహించారు. జిల్లా మేనేజర్ నజీర్ హుస్సేన్ పర్యవేక్షణ లో శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ ప్రోగ్రాం ముఖ్య ఉద్దేశం ఆపస్మరక స్థితిలో వున్నవారికి వాయు మార్గం ఎలా తెరవాలి, శ్వాస కొశ వ్యవస్థ విధులు వాయు మార్పిడి విధానం రక్షణ ఎలా చేయడం, మొదలగు అంశాలు పై అవగహన కల్గించారు . ఈ ప్రోగామ్ లో విజయనగరం, రాజాం, బొబ్బిలి డివిజన్‌ల ఓ.ఇ. సాయి షణ్ముఖరావు, ఉపేంద్ర తదితరులు, 41 సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ విజ్ఞానశాస్త్ర దినోత్సవం



విశాలాంధ్ర-విజయనగరం కంటోన్మెంట్ : విద్యార్థులు శాస్త్రీయ కోణంలో ఆలోచిస్తూ శాస్త్ర విజ్ఞానాన్ని పెంపొందించుకొని భవిష్యత్తులో సైంటిస్టులుగా ఎదిగి దేశానికి విశేషమైన సేవలు అందజేయాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఎరుకొండ ఆనంద్, జాతీయ విద్యా విభాగం కన్వీనర్ డాక్టర్ ఏవి రాజశేఖర్ ఆకాంక్షించారు. జన విజ్ఞాన వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం కంటోన్మెంట్ గురజాడ పాఠశాలలో సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నోబెల్ బహుమతి గ్రహీత సర్ సివి రామన్ ఎఫెక్ట్ కనిపెట్టిన రోజున పురస్కరించుకొని ప్రతి ఏడాది ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు1989, ఫిబ్రవరి 28 సైన్స్ డే రోజున జనవిజ్ఞాన వేదిక ఆవిర్భవించిందని,ఆనాటి నుండి నేటి వరకు 36 ఏళ్లుగా జన విజ్ఞాన వేదిక అంధవిశ్వాసాలకు వ్యతిరేకంగా అలుపెరిగిన పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. ప్రజలను శాస్త్రీయ కోణంలో ఆలోచించే విధంగా వారిని చైతన్యపరిచేందుకు అనేక కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు.ప్రధానంగా పాఠశాలలు, కళాశాలలో విద్యార్థులను శాస్త్రీయ కోణంలో ఆలోచింపజేసేందుకు విశేషమైన కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం జనవిజ్ఞాన వేదిక వారోత్సవాలు సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో విజేతలుగా నిర్వహించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గురజాడ పాఠశాల హెచ్ఎం పూడి శేఖర్, జన విజ్ఞాన వేదిక జిల్లా కోశాధికారి రమేష్, నగర అధ్యక్ష,కార్యదర్శులు షిణగం శివాజీ, పి.షణ్ముఖరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకర సూర్యనారాయణ, శీరాపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మెరకముడిదాం : మండలంలో పోటీల్లో 6 పాఠశాలల

విద్యార్థులు పాల్గొన్నారు. ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు డి.వెంకటేష్, కె.వెంకటేష్, కె.జనని మొదటి స్థానాన్ని గెలుచుకున్నారు. వీరు జిల్లాస్థాయి పోటీలకు అర్హత సాధించారు. వీరికి విద్యార్థులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి ఎం.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు గైడ్ టీచర్లు, సి ఆర్ ఎం టీ ఎస్ ఎం ఆర్ సి సిబ్బంది పాల్గొన్నారు.

మెరకముడిదాం : మండల పరిషత్ ప్రాథమికొన్నత పాఠశాల- చినంటుపల్లి ప్రధానొపాధ్యయులు ఆల్తి రాంబాబు ఆధ్వర్యంలో జాతీయసైన్స్ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ప్రధానొపాధ్యయులు ఆల్తి రాంబాబు జాతీయ సైన్స్ దినోత్సవం గురించి మాట్లాడుతూ సైన్స్ అనేది మన దైనందిన జీవితంలో అత్యంత కీలకమైన అంశం, ఆధునిక ప్రపంచంలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం లేకుండా మన జీవితాన్ని ఊహించుకోలేము. ఈ ప్రపంచాన్ని శాసిస్తూ, నడిపించే శక్తిగా సైన్స్ కీలక పాత్ర పోషిస్తోంది.. సైన్సు అద్భుతాలను, దాని ప్రభావాన్ని మనందరికీ తెలియజేయుడంలో "నేషనల్ సైన్స్ డే" ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తోంది. "నేషనల్ సైన్స్ డే" విషయానికి వస్తే భారత దేశానికి గర్వకారణమైన శాస్త్రవేత్త సర్ సి.వి. రామన్ 1928- ఫిబ్రవరి 28 న తన ప్రఖ్యాత "రామన్ ఎఫెక్ట్"ను కనుగొన్నారు. ఈశాస్త్రీయ పరిశోధనకు గౌరవ సూచకంగా భారత ప్రభుత్వం 1986 ఫిబ్రవరి -28న జాతీయ సైన్స్ దినొత్సవం ఫిబ్రవరి 28 న 1987 నుండి ప్రతి సంవత్సరం జాతీయ సైన్స్ దినోత్సవంగా జరుపుకుంటోంది. ఈకార్యక్రమంలో జి.అప్పలనాయుడు, బి.శ్రీదేవి, ఆర్.నారాయణ రావు, కె.త్రివేణి వి.మోహనరావు పాల్గొన్నారు.

మెంటాడ : మానవాళి అభివృద్ధికి సైన్స్ ఎంతో

దోహదపడుతుందని డిప్యూటీ డీఈవో మోహన్ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనశుక్రవారం మధ్యాహ్నం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జాతీయ సైన్స్ ఎగ్జిబిషన్ను సందర్శించారు. అనంతరం డిప్యూటీ డిఈఓ మాట్లాడుతూ ప్రతిఏత ఫిబ్రవరి 28న జాతీయ సైన్సు దినోత్సవాన్ని జరుపుకుంటామని తెలిపారు. జిల్లాలో గల అన్ని ప్రభుత్వ యాజమాన్యం పాఠశాల నుండి ఎంపికైన విద్యార్థులను మండల స్థాయిలో మండల కేంద్రంలో ఎంపిక చేసిన విద్యార్థులను జిల్లా స్థాయిలో నిర్వహించబడే పోటీలకు హాజరయ్యేటట్టు సంబంధిత ప్రధాన ఉపాధ్యాయులు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. విద్యార్థినీ విద్యార్థులు సైన్స్ కు సంబంధించిన వివిధ నమోద నమూనాలు ప్రదర్శన చేశారు. అలాగే మార్చి 1వ తేదీన సెయింట్ ఆన్స్ పాఠశాల కంటోన్మెంట్. విజయగరం నందు నిర్వహించే జిల్లా స్థాయి పోటీలకు ప్రతి మండలం నుంచి క్విజ్ పోటీలకు ముగ్గురు విద్యార్థులు. ఒక గైడ్ టీచర్ సెమినార్ నిమిత్తం ఒక విద్యార్థి ఒక గైడ్ టీచర్ ప్రతి మండలం నుంచి గరిష్టంగా నాలుగు విద్యార్థులు రెండు గైడ్ టీచర్స్ హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓబి2 యు వి ఎస్ శివాజీ వర్మ పాఠశాల హెచ్ఎం సిహెచ్ అరుణ సైన్స్ ఉపాధ్యాయులు వి. శ్రీనివాసరావు ఎస్. కౌసల్య పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ : ఎల్లప్పుడూ నూతన ఆలోచనలతో విద్యార్థులు ప్రతిభావంతులుగా ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు నిరంతరం కృషి చేయాలని ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ మంచు కుమారస్వామి విజ్ఞప్తి చేశారు.

పట్టణంలోని ఉడా కాలనీలో ఉన్న బ్రైట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో శుక్రవారం జరిగిన సైన్స్ విజ్ఞాన ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యవంతులుగా ఉన్నప్పుడే ప్రతిభవంతులగా ఎదిగేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యతనిస్తూ చదువులో ముందు అడుగు వేయాలని సూచించారు. కంటి సమస్యల పట్ల అప్రపత్తంగా ఉండాలని, పోషకాహార లోపం వల్ల, ఎక్కువగా మొబైల్ చూడడం వల్ల, ట్రాఫిక్ లో కళ్ళలోకి దూళి రేణువులు పడటం వల్ల కంటి సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. కళ్ళ సమస్యలపై అందుబాటులో ఉన్న నేత్ర వైద్యులను సంప్రదించాలని సూచించారు. కృషి, పట్టుదల, క్రమశిక్షణ విద్యార్థులను ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు దాహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కె.రేవతి, కరస్పాండెంట్ ఓ.అవినాష్, ప్రిన్సిపాల్ ఎస్. శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ : భారతీయ భౌతిక శాస్త్రవేత్త సర్ సి.వి.

రామన్‌చే 1928లో రామన్ ఎఫెక్ట్ ఆవిష్కరించారని, దానికి గుర్తుగా ఈ రోజు సైన్స్ డే జరప బడుతుందని సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ టీవీ కట్టిమని తెలిపారు. భారతీయ విజ్ఞాన వ్యవస్థను దానిలోని గొప్పదనాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని, వ్యవసాయ పద్ధతుల్లో నూతన పోకడలను ఉపయోగించి ఎక్కువ ఫలసాయాన్ని పొందాలని పిలుపునిచ్చారు. సెంట్రల్ ట్రైబల్ యూనివర్శిటీ ఆంధ్రప్రదేశ్ ప్రాంగణంలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు ముందుగా అతిదులు సర్ సి వి రామన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రొఫెసర్ శరత్ చంద్ర బాబు మాట్లాడుతూ ఈ సంవత్సరం సైన్స్ డే యొక్క థీమ్ వికసిత్ భారత్ కోసం సైన్స్ అండ్ ఇన్నోవేషన్లో గ్లోబల్ లీడర్షిప్ కోసం భారతీయ యువతకు సాధికారత" అనే అంశాన్ని విపులంగా వివరించారు. అనంతరం ముఖ్య అతిథిగా విచ్చేసిన డా. అరవింద్ కుమార్, మాజీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (రీసెర్చ్), ఇక్రిశాట్, గ్లోబల్ రీసెర్చ్ డైరెక్టర్ ప్రసాద్ సీడ్స్, హైదరాబాద్ మాట్లాడుతూ యువతలో శాస్త్రీయ దృక్పధాన్ని పెంపొందించాల్సిన భాధ్యత ఆధ్యాపకులపై ఉందని ప్రపంచం ఎదుర్కోబోయే సవాళ్లను సైన్స్ ద్వారా పరిష్కరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. యూనివర్సిటీ లో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు సైన్స్ డే మెడల్స్, సర్టిఫికటేలు అందజేశారు. డాక్టర్ అనిరుధ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం లో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ తంత్రవాహి శ్రీనివాసన, డీన్ జితేంద్ర మోహన్ మిశ్రా, బయోటెక్నాలజీ విభాగాధిపతి డా. పరికిపండ్ల శ్రీదేవి తదితర అధ్యాపక, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ : స్థానిక తోటపాలెంలో గల సత్య డిగ్రీ & పీజీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లైఫ్ సైన్సెస్ లేబరేటరిలో రీసెర్చ్ సైంటిస్ట్‌గా పనిచేస్తున్న డి.ప్రేమసుధాకరం విచ్చేశారు. ఈ కార్యక్రమంలో మొదటిగా సర్ చంద్రశేఖర వేంకట రామన్ చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతిప్రజ్వలనచేసి నివాళులు అర్పించారు. కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం శశి భూషణ రావు మాట్లాడుతూ విద్యార్థులు సి.వి.రామన్ వంటి శాస్త్రవేత్తలు ఎంత అంకిత భావంతో ఉండేవారో అటువంటి వ్యక్తులను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు తమ దిశను నిర్దేసించుకోవాలని కోరారు. వివిధ పోటీలలో విజేత లయిన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. విద్యార్థులు వివిధ సైన్స్ పోస్టర్లను, మోడల్ సుప్రదర్శించారు.ఈ కార్యక్రమం లో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వి సాయి దేవ మణి, సైన్స్ అధ్యాపకులు, ఎన్ సి సి ఆఫీసర్లు కెప్టెన్ ఎం సత్య వేణి, లెఫ్టినెంట్ ఎం ఉదయ్ కిరణ్, ఎన్ ఎస్ ఎస్ ఆఫీసర్ బి సూరపు నాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజాం : డాక్టర్ సివి రామన్ రామన్ ఎఫెక్ట్ ని కనుగొని

వాటి ఫలితాలను ఈ ప్రపంచానికి అందించిన ఈ రోజును జాతీయ సైన్స్ దినోత్సవం గా యావత్ భారతదేశం ఘనంగా నిర్వహించుకుంటుంది. ఈ కార్యక్రమంలో భాగంగా రాజాం శ్రీ చైతన్య పాఠశాలలో సైన్స్ దినోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాజాం పట్టణ మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు,రాజాం మండల విద్యాధికారి ప్రవీణ్ విద్యార్థులు తయారుచేసిన అనేక రకాల సైన్స్ ప్రాజెక్టలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులలో సైన్స్ పట్ల ఆసక్తిని పెంచేందుకు సృజనాత్మకతను వెలికి తీయడానికి ఈ ప్రాజెక్టులు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపల్ ప్రభాకర్ మాట్లాడుతూ సివి రామన్ సైన్స్ రంగంలో చేసిన కృషిని ప్రయోగాలను విద్యార్థులకు సవివరంగా వివరించారు. డీన్లు సురేంద్ర, జామి, శ్రీనివాస్ ఏవో ఎల్లం నాయుడు, వైస్ ప్రిన్సిపల్ సంధ్యారాణి ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : దేశ ఆర్థిక ప్రగతికి విజ్ఞాన శాస్త్ర పరిశోధనలు

కీలకమైనవి, సైన్స్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉందని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ పగడాలమ్మ అన్నారు. పట్టణంలోని వేణుగోపాలపురం ప్రభుత్వ డైట్ కళాశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సైన్స్ తోనే అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. సివి రామన్ కనుగొన్న రామన్ ఎఫెక్టు గురించి తెలుసుకోవాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ రామకృష్ణారావు మాట్లాడుతూ శాస్త్ర సాంకేతికత రంగాలలో భారతీయుల పాత్ర గొప్పదన్నారు. మూఢ విశ్వాసాలకు దూరంగా ఉండాలని చెప్పారు. మానవుని అభివృద్ధికి విజ్ఞానికి శాస్త్రం దోహదపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు రవికుమార్, రామకృష్ణ, భారతి, శ్రీనివాస్, సూర్యారావు, ఎం రామకృష్ణ, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ :

ఒక తెలిసిన విషయాన్ని విశ్లేషణాత్మక, ప్రయోగాత్మకంగా చేని చూవించడవే విజ్ఞానము' అటువంటి విజ్ఞానం నేటి ప్రపంచంలో అమోఘం అనడానికి శుక్రవారం రింగ్ రోడ్డులో గల శ్రీచైతన్య పాఠశాలలో ఏర్పాటు చేసిన పలు అంశాలపై ప్రయోగాలు, చిత్రాలే నిదర్శనమని విజ్ఞాన ప్రదర్శనకు ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీ చైతన్య పాఠశాలల ప్రాంతీయ పర్యవేక్షణాధికారి వి. శ్రీనివాస రావు తెలియజేశారు. అదేవిధంగా ప్రదర్శనకు విశిష్ట అతిథిగా విచ్చేసిన జోనల్ అకడమిక్ కో-ఆర్డినేటర్ వెంకటరమణ మాట్లాడుతూ ఈ విద్యార్థులు ప్రాజెక్టులను ప్రదర్శించిన ప్రతిభాపాటవాలను చూసి "విజ్ఞానం ఎంతగానో అభివృద్ధి చెందిందని తెలుసుకోవడానికి ఇది ఒక చక్కని వేదిక అని విద్యార్థులను ప్రశంసిస్తూ తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీధర్‌బాబు మాట్లాడుతూప్రతి విద్యార్థి భవిష్యత్తులో మరింత విజ్ఞానం పొందాలనీ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆకాంక్షించారు. అదేవిధంగా పాఠశాలడీన్. సూర్యచంద్ర, కే.సత్యనారాయణ, ఎం. చిన్ననాయుడు, వైస్. ప్రిన్సిపాల్ ఎం. విక్రమ్, హరికృష్ణ సైన్స్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస : జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా జిల్లా

పరిషత్ ఉన్నత పాఠశాల కంటకాపల్లిలో శుక్రవారం నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలలో విద్యార్థుల ప్రతిభను కనబరిచినట్లు ప్రధానోపాధ్యాయులు వి.అరుణకుమార్ తెలిపారు. ప్రథమ బహుమతి హ్యూమన్ బాడీ సిస్టంకు కె.జోషిత 9వ తరగతి, రిఫ్లెక్సీన్ అఫ్ లైట్ కు ద్వితీయ బహుమతి ఎస్. ధనుంజయ్ 8వ తరగతి తృతీయ బహుమతి ఓల్కనోకు బి.సూర్యపుష్కల 6వ తరగతి సాధించినట్లు పేర్కొన్నారు. ముందుగా పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయ సిబ్బందితో కలిసి ఆయన సర్ సి.వి.రామన్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళలు అర్పించారు.

బొబ్బిలి : పట్టణం ఫైర్ స్టేషన్ ఎదురుగా ఐరిష్ స్కూల్

కరస్పాండెంట్ వి విజయ్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పలువురు విద్యార్థులు చేసిన సైన్స్ టాలెంట్ ప్రాజెక్టులను ఆకట్టుకున్నాయి. సైన్స్ ప్రాజెక్టులు తయారీలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కరసడెంట్ విజయ్ కుమార్ శర్మ అభినందించారు.

బాడంగి : ఆధునిక యుగంలో అభివృద్ధి బాటలో ప్రయాణించాలంటే విద్యార్థులంతా సైన్స్ పట్ల ఆసక్తి కనపరచాలని ఎంఈఓ రాజేశ్వరి కోరారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాడంగిలో సైన్స్ డిపార్ట్మెంట్ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు.ముందుగా చంద్రశేఖర్ వెంకటరామన్ (సి.వి.రామన్). చిత్రపటానికి ఎంఈఓ రాజేశ్వరి,హెచ్ఎం సత్యన్నారాయణ నివాళులు అర్పించారు. హెచ్ఎం సత్యనారాయణ మాట్లాడారు. స్థానిక ఎస్వీఆర్ స్కూల్‌లో ప్రధానోపాధ్యాయులు బి శ్రీనివాస రావు ఆధ్వర్యంలో సైన్స్ డే ను ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థిని విద్యార్థులు చాలా ప్రయోగాత్మకమన ప్రాజెక్టలను ప్రదర్శించారు. స్థానిక గురుకుల పాఠశాలలో కోడూరు పాల్తేరు వాడాడ ఉన్నత పాఠశాలలో సైన్స్ డేను ఘనంగా నిర్వహించారు.

వేపాడ: మండల కేంద్రమైన వేపాడ శివారు బక్కు నాయుడుపేటలో గల ఆదర్శ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు.శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకొని సివి రామన్, రామన్ ఎఫెక్ట్ కనుగొన్నదానికి గుర్తుగా పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ముందుగా సివి రామన్ చిత్ర పటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ రావాడ ఈశ్వరరావు మాట్లాడుతూ సివి రామన్ గొప్పతనాన్ని ఆయన సాధించిన విజయాలను వివరిస్తూ మానవుని దైనందిన జీవితంలో సైన్సు కీలక పాత్ర పోషిస్తుందన్నారు. దైనందిన ఆధునిక జీవితంలో సైన్స్ లేనిదే జీవితాన్ని ఊహించుకోలేమని ఈప్రపంచాన్ని శాసిస్తున్నది నడిపిస్తున్నది సైన్సు మాత్రమేనని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులు నైపుణ్యంతో తయారుచేసిన 72 ప్రాజెక్టులను ప్రదర్శించారు. విద్యార్థులకు సైన్స్ ఉద్దేశించి రంగవల్లి పోటీలు, వకృత్వ, వ్యాసరచన, పోటీలు నిర్వహించారు.విద్యార్థులు వివిధ సాంస్కృతిక ప్రదర్శనలతో పాఠశాలను ఆనందతాండవంతో ముంచెత్తారు.అలాగే పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపాల్ రావాడ ఈశ్వరరావు చేతుల మీదగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు జి.విజయ, ఎస్.ప్రసాద్ రావు,బి.శారదమ్మ, పి.బేబీరాణిలు ప్రముఖ పాత్ర పోషించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

రాజాం : జీఎంఆర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో రెండు

రోజుల పాటు నిర్వహించబడిన జాతీయ స్థాయి ఇంజనీరింగ్ విద్యార్థుల సాంకేతిక సదస్సు స్టైప్కాన్-2025, 28 ఫిబ్రవరి 2025 శుక్రవారం ఘనంగా ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ, స్టైప్ కోన్ అనేది నేడు కేవలము ఒక సాంకేతికమైన ఈవెంట్ కాదని దానికి బహుముఖ ప్రాధాన్యత చేకూరిందని అన్నారు. కార్యక్రమంలో జీఎంఆర్ విఫ్ డైరెక్టర్ ఎడ్యుకేషన్ డాక్టర్ జె గిరీష్ మాట్లాడుతూ విద్యార్థులందరికీ విశేషమైన శక్తి సామర్థ్యాలు వివిధ రంగాల్లో ఉన్నాయనడానికి వారు గత రెండు రోజులుగా చేసిన వివిధ కార్యక్రమాలే నిదర్శనం అని అన్నారు. రాబోయే రోజుల్లో 'జూని కార్న్' కోసం వివిధ రకాల ఆలోచనలను, ప్రతిపాదనలను పంపించాలని ఆయన కోరారు. ఎప్పటి లాగానే ఈ సంవత్సరం కూడా జీఎంఆర్ఐటీ నుంచి ఐదుగురు విద్యార్థులు ఇంటెర్నషిప్ కోసం ప్యారిస్ వెళు తున్నారని అందులో ప్రతిభ ప్రదర్శించిన వారికి మంచి ఉద్యోగ అవకాశాలు ఉంటాయని వివరించారు. కాబట్టి విద్యారంగంలో విశేషమైన ప్రతిభ చూపించి. ఉన్నత అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆయన ఉద్భోదించారు. ఇందుకు థామస్ అల్వా ఎడిసన్ జీవితం ఒక మంచి ఉదాహరణ కాగలదని చెప్పారు.దేశం నలుమూలల నుంచి 3884 మంది పాల్గొన్న ఈ మెగా జాతీయ సదస్సు లో వివిధ కళాశాలలకు చెందిన 165 మంది విద్యార్థులు వివిధ విభాగాల్లో సాంకేతిక పత్రాలను సమర్పించారని, 443 మంది విద్యార్థులు వివిధ వర్క్ షాపులలో,106మంది ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్ పోటీలో, 81మంది స్టార్ట్ అప్ ఐడియాస్ పోటీలో, 44మంది జీ పీ ఎల్ వంటి సెంట్రల్ పోటీలతో పాటు వివిధ ఈవెంట్లలో పాల్గొన్నారని కన్వీనర్ డా. జె శ్రీధర్ తన నివేదికలో వివరించారు. ఈ ముగింపు కార్యక్రమంలో ఐ ఎస్ టి ఈ చాప్టర్ స్టైప్కాన్-2025 యొక్క సావనీర్ను విడుదల చేశారు. ఈ ముగింపు కార్యక్రమంలో స్టైప్ కాన్-2025లో జరిగిన వివిధ పోటీలలో విజేతలకు సర్టిఫికెట్లు మరియు బహుమతులు అందజేశారు. స్టూడెంట్ కౌన్సిల్ సంయుక్త కార్యదర్శి నందిని వర్మ స్వాగతించగా, కో-కన్వీనర్ డాక్టర్ ఎం సతీష్ వందన సమర్పణ చేశారు. స్టూడెంట్ కౌన్సిల్ ప్రెసిడెంట్ జి కౌశిక్, ఇతరస్టూడెంట్ కౌన్సిల్ సభ్యులు, కార్యక్రమములో అసోసియేట్ డీన్లు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ : భారతదేశ గడ్డపైనే చదువుకొని తలమానికమైన పరిశోధనలు జరిపి విజ్ఞాన శాస్త్రంలో దేశ శక్తి సామర్థ్యాలను ప్రపంచానికి చాటి చెప్పిన మేధావి సర్ సివి రామన్ యొక్క సేవలను పురస్కరించుకొని జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని జేఎన్టీయూ గురజాడ సాంకేతిక కళాశాల విజయనగరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రొఫెసర్ పాల్ డగ్లస్ రసాయన శాస్త్ర ఆచార్యులు ఆంధ్ర యూనివర్సిటీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జేఎన్టీయూ జీవీ ఉపకులపతి ఆచార్య డి రాజ్యలక్ష్మి, రిజిస్ట్రార్ ఆచార్య జి జయసుమ, ప్రిన్సిపాల్ డా.ఆర్ రాజేశ్వరరావు, వైస్ ప్రిన్సిపల్ డా. జీజే నాగరాజు, బి ఎస్ ఎం హెచ్ ఎస్ ఎస్ విభాగ అధిపతి డా. ఎం. సౌభాగ్య లక్ష్మి, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జాతీయ స్కెన్స్ దినోత్సవ వేడుకలు శుక్రవారం జరిగాయి. పాఠశాల ఆవరణలో జాతీయ స్కెన్స్ దినోత్సవం సందర్భంగా సర్ సివి రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా

పాఠశాల హెచ్ఎం బి ఉమామహేశ్వరరావు, స్కెన్స్ ఉపాధ్యాయులు పొట్నూరు శివాజీ, బి జయ, తమ్మినాన రాజేష్, వానపల్లి రమేష్, వాకాడ సరస్వతి, అరసాడ సురేంద్రనాద్, ఏవి స్వామి, జి.రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో స్కెన్స్ ఉపాధ్యాయులు విద్యార్థులచే స్కెన్స్ ప్రాజెక్ట్ తయారు చేయించారు. జాతీయ స్కెన్స్ దినోత్సవం సందర్భంగా సుమారు 90కి పైగా ప్రాజెక్టులు విద్యార్థులు ప్రదర్శించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలుగు తీసేందుకు నిత్య జీవితంలో వినియోగించుకునేందుకు సమస్యల పరిష్కారానికి స్కెన్స్ ప్రాజెక్ట్ దోహదపడతాయని హెచ్ఎం బి ఉమామహేశ్వర రావు తెలిపారు. సిహెచ్ నిశాంత శ్రీ సూర్య, భరత్ సాయి తయారు చేసిన స్మార్ట్ మల్టీ అగ్రికల్చర్ డివైజ్, సిహెచ్ కార్తీక్ టీం తయారుచేసిన స్మార్ట్ కాలింగ్ బెల్, సిహెచ్ దుర్గా గణేష్ అండ్ సాత్విక్ తయారుచేసిన హ్యూమన్ రెస్పిరేటరీ సిస్టం, ఎస్ ఉష అండ్ ఎల్ ఐశ్వర్య తయారు చేసిన ఎలక్ట్రికల్ బెల్, వాటర్ ప్యూరిఫికేషన్, ఆర్వో ప్లాంట్, హైడ్రాలిక్ మిషన్, హార్ట్ ఫంక్షన్ మోడల్, వాటర్ అలారం వర్కింగ్ మోడల్, లో కాస్ట్ మెటీరియల్ తో జెసిబి తయారీ, మల్టీపర్పస్ హార్వెస్టింగ్ మిషన్, మానవ శ్వాస వ్యవస్థ, స్మార్ట్

కాలింగ్ బెల్, గైరోస్కోప్ తదితర ప్రాజెక్టులు విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. మంచి ప్రాజెక్టులు తయారుచేసిన విద్యార్థులు అభినందిస్తూ విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

విజయనగరం టౌన్ : స్థానిక గాజుల రేగ పరిధిలో గల నారాయణ పబ్లిక్ పాఠశాలలో శుక్రవారం నేషనల్ సైన్స్ డే వేడుకలను పాఠశాల ఆవరణలో నిర్వహించారు ముందుగా విద్యార్థులు పాఠశాల సిబ్బంది సర్ సివి రామన్ చిత్రవటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులుచే రూపొందించిన వివిధ సైన్స్ ప్రాజెక్టులతో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. పాఠశాల సైన్స్ ఉపాధ్యాయిని మీసాల స్వాతి మాట్లాడుతూ విద్యార్థులలో దాగివున్న సృజనాత్మకతను, నైపుణ్యాలను వెలికి తీయడానికి సైన్స్ ప్రాజెక్టులు ఎంతో ఉవయోగవడతాయన్నారు. విద్యార్థులంతా చిన్ననాటి నుండే సైన్స్ నూతన ప్రాజెక్టులు చేసేందుకు ప్రయత్నం చేయాలన్నారు.పాఠశాల కరస్పాండెంట్ మొయిద నారాయణ రావు మాట్లాడు-తూ సర్.సి.వి. రామన్ రామన్ ఎఫెక్ట్ కనుగొన్న సందర్భంగా 1928 ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవంగా జరుపుకుంటున్నా మన్నారు. చిన్ననాటి నుండే ఇటువంటి సైన్స్ ప్రాజెక్ట్లు తయారు చేయడం వల్ల విద్యార్థులకు రానున్న కాలంలో ఎంతో లాభం ఉంటుందన్నారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బొబ్బిలి : పట్టణం చర్చి జంక్షన్ బ్యాంక్ ఆఫ్

ఇండియా ఎదురుగా శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ పాట మురళీధర్, వైస్ ప్రిన్సిపాల్ గోన చంద్రశేఖర్ సిబ్బంది ఆధ్వర్యంలో స్కూల్లో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. పలు తరగతులకు చెందిన పలువురు విద్యార్థులు తయారుచేసిన విజ్ఞాన నమూనా ప్రాజెక్టలను ఎంతగానో ఆ కొట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కోట మురళీధర్,డీన్ మాట్లాడుతూ చిన్నతనం నుండే విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మక వైజ్ఞానిక ప్రతిభను వెలికి తీయడానికి ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు ఎం సన్యాసిరావు, డీన్ ఎస్ దుర్గాప్రసాద్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌కు చేరిన డంపర్ బిన్లు

విశాలాంధ్ర-విజయనగరం : నగర వీధులను మరింత పరిశుభ్రపరిచేందుకుగాను 48 డంపర్ బిన్లు అందుబాటులోకి వచ్చాయి. ఈ మేరకు శుక్రవారం నగరానికి చేరుకున్న 48 డంపర్ బిన్లను ప్రజారోగ్య సిబ్బంది భద్రపరిచారు. త్వరలో వాటిని వినియోగంలోకి తీసుకురానున్నట్లు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. మరో 15 రోజుల్లో మరొక 50 డంపర్ బిన్లు కూడా నగరానికి రానున్నాయని తెలిపారు. మొత్తంగా 98 డంపర్ బిన్లతో ప్రతిరోజు పారిశుధ్య విధానాన్ని మరింత మెరుగుపరిచేందుకు వినియోగిస్తామని ఈ సందర్భంగా కమిషనర్ తెలిపారు.

పేదలకు తువ్వాళ్ళు పంపిణీ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జిల్లా ఆర్యవైశ్య సంఘం జిల్లా నలుమూలల పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు చెరుకూరి నాగరాజు పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం వద్ద పేదలకు తువ్వాళ్ళు, దుప్పట్లు,రొట్టెలు పంపిణి చేశారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు తవ్వా మోహనరావు, యువజన సంఘం అధ్యక్షులు ఆరిశెట్టి సందీప్, సంఘం ఉపాధ్యక్షులు మాచర్ల చంద్రశేఖర్ గుప్తా, సహాయ కార్యదర్శి సముద్రాల నాగరాజు, విజ్జపు వెంకట శ్రీనివాసరావు, వళ్ళంపాటి ఉపేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

జయితిలో హెడ్ మాస్టర్ రామారావు ఉద్యోగ విరమణ

విశాలాంధ్ర-మెంటాడ : విశాలాంధ్ర :మెంటాడ మండలం జయితి గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన పొట్టా రామారావు ను శుక్రవారం పలువురు అభినందించారు. ఈ ఉద్యోగ విరమణ సందర్భంగా రామారావు మాష్టారు చేసిన సేవలు మరువలేనివి కొనియాడారు. విద్యార్థుల అభివృద్ధికి మాష్టారు చేసిన సేవలు మరువలేనివి కొనియాడారు. ఈసందర్భంగా స్కూల్ విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. దత్తరాజేరు మండలం రాజుల రామచంద్రపురం, మెంటాడ, కైలాం, చల్లపేట, అనంతరం దత్తరాజేరు మండలం పెదకాద, గజపతినగరం మండలం గంగ చొల్లపెంట, గరివిడి మండలంలో ప్రధానోపాధ్యాయులుగా పని చేశారు. జయతి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తూ పదవి విరమణ పొందారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ డిఈఓ.కె. మోహన్ రావు ఎం ఈ ఓబి2 యు వి ఎస్ శివాజీ వర్మ,సహచర ఉపాధ్యాయులు పలువురు గ్రామస్తులు సహాయ సహకారాలతో ఆయను ఘనంగా సన్మానించారు.

ముంజేరులో పోలీసుల పల్లెనిద్ర

విశాలాంధ్ర-భోగాపురం : భోగాపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని ముంజేరు గ్రామంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్ వి ప్రభాకర్ గురువారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులతో వారి సమస్యలను చర్చించి, సామాజిక వ్యతిరేక కార్యకలాపాలను నివారించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో, నిఘా అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు, భద్రతను పెంచడానికి గ్రామస్తులు తమ ఇళ్ళు, వ్యాపార సంస్థలు మరియు దేవాలయాలలో సిసిటివి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. పోలీసులకు నివేదించబడిన ఏవైనా సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని ఆయన ప్రజలకు హామీ ఇచ్చారు. సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించడంతోపాటు, అనుమానాస్పద కార్యకలాపాలను పోలీసు హెల్ప్‌లైన్ నంబర్‌లకు 100 లేదా 112కు కాల్ చేయడం ద్వారా వెంటనే ఫిర్యాదు చేయాలని గ్రామస్తులను ప్రోత్సహించారు. అనంతరం ముంజేరు ఉన్నత పాఠశాలలో నిద్రించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, గ్రామ పెద్దలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

స్కూల్ విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్ల పంపిణీ



విశాలాంధ్ర-బొబ్బిలి : యువరాజా ఎమ్మెల్యే ఆర్ వి ఎస్ కే కే రంగారావు బేబినాయన కుమార్తె మేధా తల్లి పుట్టినరోజు సందర్భంగా పట్టణంలో సేవా సంస్థలకు నిర్వాహకులు అభిమానులు పలు సామాజిక కార్యక్రమాలు చేపట్టి ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగానే నేను సైతం సేవాసంస్థ నిర్వాహకులు బొంగు గౌరీ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో నేతాజీ ప్రాథమిక పాఠశాలలో మేధా తల్లి పుట్టినరోజు ను పురస్కరించుకొని పాఠశాల పిల్లలందరికి నోటు పుస్తకాలు,బిస్కెట్ పేకెట్స్, చాక్లెట్స్,పెన్నులు, పెన్సిల్స్, షార్పనర్స్, ఏరైజర్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బొత్స అప్పలు, బొట్టా శివ ,స్కూల్ నల్ల లక్ష్మణ్ ,శ్రీధర్ బృందవనం, చిట్టిబాబు, సందీప్, రాజు, భానుచంద్ర పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో సహకార రంగానికి చిన్నచూపు : భీశెట్టి

విశాలాంధ్ర-విజయనగరం రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం 2025-26 సంవత్సరంకి గాను శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన పూర్తి స్థాయి బడ్జెట్‌లో సహకార సంఘాల బలోపేతం, సహకార చక్కెర ఫ్యాక్టరీ ల ఆధునికీకరణ,మార్కెట్ యార్డుల అభివృద్ధి, తదితర అంశాలపై కనీసం దృష్టి సారించలేదని లోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి ఆవేదన వ్యక్తంచేశారు. శుక్రవారం పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థికశాఖమంత్రి పయ్యావుల కేశవ్ 3,22,359 కోట్ల రూపాయల తో ప్రవేశ పెట్టిన బడ్జెట్లో రెవెన్యూ వ్యయం 2,51,162 కోట్లుగా మూల ధన వ్యయం 40,635 కోట్లుగా రెవెన్యూ లోటు 33,185 కోట్లు,ద్రవ్యలోటు గా 79,926 కోట్లు గా ప్రకటించారని, బడ్జెట్ లో కీలకమైన విద్యా రంగానికి కేవలం 11 శాతం,ఆరోగ్యం కోసం 6 శాతం,వ్యవసాయం కోసం 4 శాతంగా, గ్రామీణ పంచాయతీ రాజ్ అభివృద్ధి కోసం 6 శాతం,ఇరిగేషన్ కోసం కేవలం 5 శాతం మాత్రమే కేటాయింపులు చేసారని భీశెట్టి అన్నారు, సాగునీటి ప్రాజెక్టులు, జలవనరులకి కేటాయించిన కేటాయింపులు ఏ మాత్రం సరిపోవని కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో ప్రవేశపెట్టినా బడ్జెట్ ఆశించినంత అద్భుతంగా లేదని కేటాయింపులు చేసిన మేరకు పూర్తి స్థాయిలో నిధులు ఖర్చులు జరిగి రాష్ట్రం అభివృద్ధి చెందేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పూర్తిగా దృష్టి సారించాలని గత ప్రభుత్వం పాలనలో మూత పడ్డ పరిశ్రమలకోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకొని ఉంటే బాగుండేదని భీశెట్టి అభిప్రాయపడ్డారు, నైపుణ్య అభివృద్ధి కోసం 1228 కోట్లు మంజూరు చెయ్యడం అభినందనీయమని ఆయన అన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా ప్రతినిధి అల్లంశెట్టి నాగభూషణం,పౌరవేదిక ప్రతినిధులు తాడేపల్లి నాగేశ్వరరావు, జలంత్రి రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

రాజాం : మన రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ నిరాశజనకంగా ఉందని కాంగ్రెస్ పార్టీ రాజాం నియోజకవర్గం ఇన్చార్జ్ కుప్పిలి చైతన్యకుమార్ విమర్శించారు. శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ పై ఆయన స్పందిస్తూ, రైతులకు అన్యాయం జరిగిందన్నారు. ప్రాజెక్టులకు కేటాయింపులు తగిన స్థాయిలో లేవని, అదే విధంగా పథకాల అమలుకు కూడా అవసరమైన నిధుల కేటాయింపులు జరగలేదని విమర్శించారు.

విశాలాంధ్ర చెబితేనే పంచాయతీకి పన్నులు గుర్తుకువస్తాయా..!

- రెండేళ్ళగా పన్నుల లేకుండా నడుపుతున్న జాగరం వాటర్ ప్లాంట్
-పన్ను విధించాలని యాజమాన్యం వేడుకోలు

విశాలాంధ్ర-జామి : అధికారులు కళ్ళు మూసుకున్నారు. పెద్దోళ్ళ వ్యవహారం అని మౌనం వహించారు. ఉన్నతాధికారులుకు లేని బాధ మనకెందుకులే అని కింది స్థాయి అధికారులు సైతం చూసీ చూడనట్లు వ్యవహరించారు. పర్యావసానంగా రెండేళ్ళపాటు ఓ భారీ కంపెనీ కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టి, లక్షల్లో టర్నోవర్ చేసింది. చివరకు విశాలాంధ్ర కథనంతో అటు అధికారులు కళ్ళు తెరుచుకున్నారు. అధికారుల వత్తిడితో దిగొచ్చిన కంపెనీ యాజమాన్యం మేం పన్ను కడతాం.. పన్ను వేయండి అంటూ చివరకు పంచాయతీ చుట్టూ తిరుగుతున్నారు. మండలంలోని జాగరం రెవెన్యూ పరిదిలో బేవ్యూ బెవరేజెస్ ప్రై.లి. పేరుతో ఓ వాటర్ తయారీ కంపెనీ రెండేళ్ళ క్రితం ఏర్పాటు చేసారు. కంపెనీ ఏర్పాటు నుంచి ఇప్పటి వరకు వీరు స్థానిక పంచాయతీకి కనీసం అనుమతులునిమిత్తం ధరఖాస్తు చేయలేదు. తమకు పెద్ద స్థాయిలో అధికారులు అనుమతులు ఇచ్చారని, పంచాయితీతో సంభందం లేదని అడిగిన వారితో వాదించారు. పెద్దోళ్ళ కంపెనీ కదా అనుమతులు కూడా అలాగే ఉంటాయనే అందరూ భావించారు. దీనిపై విశాలాంధ్ర ఆరాతీయగా అనేక అశ్చర్యపరిచే వాస్తవాలు బైటపడ్డాయి. ఇదంతా గత ప్రభుత్వం పెద్దోళ్ళ పేరు చెప్పి చేసిన డ్రామాగా తేలిపోయింది. దీంతో విశాలాంధ్రలో కథనం రావడంతోపాటు జిల్లా స్థాయి అధికారులపై వత్తిడి తేవడంతో చివరకు స్థానిక పంచాయతీ కార్యదర్శి అనూరాధ కంపెనీకి వెళ్ళి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంతా బైటపడడంతో చేసేది లేక యాజమాన్యం ఇప్పుడు పన్ను వేయండి కట్టేస్తాం అంటూ కాళ్ళ బేరానికి వచ్చారు. పెద్ద అనుమతులు ఉన్న వారికి పంచాయతీ అవసరం లేదన్నవారికి ఇప్పుడు పన్నులు కట్టాల్సిన అవసరం ఏమిటని స్థానికులు నవ్వుకుంటున్నారు. ఏదిఏమైనా విశాలాంధ్ర దెబ్బకి కంపెనీ యాజమాన్యం దిగి వచ్చిందని స్థానికులు అంటుండగా, తమ పంచాయతీకి ఇలాగైనా అధాయం వస్తుందని పంచాయతీ పాలకులు సంతోషపడుతున్నారు.

నాటు సారాతో పట్టుబడిన వ్యక్తులపై కేసు నమోదు

కొత్తవలస ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఎస్సై వి.ఎన్.రాజు

విశాలాంధ్ర-వేపాడ : మండలంలోని వావిలపాడు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు నాటు సారాతో పట్టుపడడంతో వారిపై కేసు నమోదు చేయడం జరిగిందని కొత్తవలస ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఎస్సై వి.ఎస్.రాజు తెలిపారు. కొత్తవలస ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సర్కిల్ ఇన్స్పెక్టర్ జి.ఆర్.ఎస్ నాయుడు ఆదేశాల మేరకు గురువారం రాత్రి వావిలపాడు గ్రామంలో దాడులు నిర్వహించగా గ్రామానికి చెందిన లావేటి లక్ష్మి, శెట్టి దేవిల నుండి ఒక్కొక్కరి దగ్గర 2 లీటర్ల నాటు సార బాటిల్లతో పట్టుబడ్డారన్నారు.వీరి నుండి 4 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేయడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఎస్సై విఎన్ రాజు మాట్లాడుతూ కొత్తవలస ప్రొహిబిషన్ శాఖ పరిధిలో ఎవరైనా నాటు సారాయి తయారుచేసిన అమ్మినా వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ దాడిలో సిబ్బంది పి.వీర్రాజు, టి పి ఎస్ ప్రసాద్, పుష్పలత జి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జాకేరు పాఠశాలను ఎంఈఓ సందర్శన

విశాలాంధ్ర-వేపాడ : మండలంలోని జాకేరు గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను మండల విద్యాశాఖాధికారి పి. బాల భాస్కరరావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలు, తరగతి గదులు,పాఠశాల ప్రార్థనా నిర్వహణ, పాఠశాల కిచెన్ గార్డెన్, మొదలగునవి పరిశీలించారు.అలాగే విద్యార్థులతో తెలుగు,ఇంగ్లీష్ చదివించడం రాయించడం చతుర్విధ ప్రక్రియలు చేయించడం,టేబుల్స్ చదివించడం, వర్క్ బుక్స్,మోడల్ లెసన్ పరిశీలించిన అనంతరం శ్రీమతి డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం పరిశీలించి సంతృప్తం వ్యక్తం చేశారు. అనంతరం ఉపాధ్యాయుల లెస్సన్ ప్లాన్స్,టీచింగ్ డైరీలు, పాఠశాల రికార్స్ పరిశీలించి, ఉపాధ్యాయులతో రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేసి పలు సూచనలు సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

ఈ కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలి

పౌరసరఫరాల శాఖ ఉపతహసిల్దార్ సత్యనారాయణమూర్తి

విశాలాంధ్ర-గంట్యాడ : గంట్యాడ మండలం పౌర సరఫరాల విభాగానికి చెందిన ఉప తాసిల్దార్ సత్యనారాయణమూర్తి మండలంలో గల ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ పొందుతున్న లబ్ధిదారులు ఈ కేవైసీ నేటి వరకు చేయించుకోకపోయినచో తక్షణమే ఆయా సచివాలయాలకు వెళ్లి వాళ్ళ కార్డుల యొక్క ఈ కేవైసీ జతపరిచినది లేనిది ఆపరేటర్ల ద్వారా తనిఖీ చేసుకొని లేనిచో తక్షణమే ఈ కేవైసీ చేయించుకోవాలని సూచనలు తెలియజేశారు మండలంలో 43 రేషన్ షాపులు 13 మంది ఎన్డిపి ఆపరేటర్లు ఉన్నారని కూడా ఉప తాసిల్దార్ సత్యనారాయణమూర్తి తెలిపారు.

నేడు ఇంటర్ పరీక్షలకు హాజరుకానున్న 264 మంది విద్యార్థులు

విశాలాంధ్ర-వంగర : నేడు మద్దువలస జూనియర్ కాలేజీ లో 264 మంది ఫస్ట్ ఇయర్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. మండలంలో మద్దువలస (వంగర) జూనియర్ కాలేజీ విద్యార్థులు, మద్దువలస బీ ఆర్ అంబేద్కర్ గురుకుల కాలేజీ విద్యార్థులు, వంగర కేజీ బీవీ కాలేజీ విద్యార్థులు, అంతేకాకుండా రేగిడి మండలం ఉంగరాడ కాలేజీ విద్యార్థులు కలిపి మొత్తం నాలుగు కాలేజీలకు సంబంధించిన విద్యార్థులు పరీక్షలువ్రాయనున్నారు.అదేవిదంగా ఈ నాలుగు కాలీజీ లకు చెందిన ఇంటర్ సెకండియర్ విద్యార్థులు మార్చి 3న 239 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ ఇంటర్ పరీక్షలకు ఈ నాలుగు కాలేజీలకు సంబంధించిన విద్యార్థులు 503 మంది విద్యార్థులు పరీక్షలకు ఈ జూనియర్ కాలేజీ కి కేటాయించినట్లు ప్రిన్సిపాల్ కోట రవిశంకర్ వెల్లడించారు.

రామతీర్థం హుండీ లెక్కింపు

హుండీ ఆదాయం రూ.49.96.162 లక్షలు

విశాలాంధ్ర - నెల్లిమర్ల : రామ స్వామి వారి దేవస్థానం రామతీర్థం ఆవరణలో సహాయ కమిషనర్ కె.శిరీష్ పర్యవేక్షణలో శుక్రవారం మహాశివరాత్రి ఉత్సవ హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని ఆలయ సహాయ కమిషనర్ శ్రీనివాస్ నిర్వహించారు. రూ.49,96,162, బంగారం 11 గ్రాములు 800 మిల్లి గ్రాములు, వెండి 5 కేజీల 960 గ్రాములు ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ హుండీ లెక్కింపు కేవలం ఉత్సవానికి సంబంధించిన తాత్కాలిక ఆదాయం మాత్రమే అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా దేవాదాయ శాఖ తనిఖీదారు జి శ్యామ్ ప్రసాద్ ఆలయ సిబ్బంది, తులసి అర్చకులు పాల్గొన్నారు.

ఈఎస్ఐ ఆరోగ్య బీమాను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-నెల్లిమర్ల : ఈఎస్ఐ ఆధ్వర్యంలో అమలుచేస్తున్న ఆరోగ్య బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఈఎస్ఐ ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ సూచించారు. పట్టణంలోని ఆదిత్య విద్యాలయం ప్రాంగణంలో ఆ సంస్థ 74వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఈఎస్ఐలో 150 రకాల ఖరీదైన మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విజయనగరం ఈఎస్ఐ కార్యాలయం బ్రాంచి మేనేజర్ ఎం.ఎ బేగ్ మాట్లాడుతూ ఈఎస్ఐ కార్డుదారులకు అమలు చేస్తున్న పథకాలు, సౌకర్యాల కోసం వివరించారు. పాఠశాల కరస్పాండెంట్ సూరిబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సిబ్బంది సాయి సంతోష్, లావణ్య పాల్గొన్నారు.

రీసర్వేను జేసీ మాధవన్ తనిఖీ

విశాలాంధ్ర-డెంకాడ : రీసర్వే ప్రక్రియను జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ తనిఖీ చేశారు. ఆయన డెంకాడ మండలంలో శుక్రవారం పర్యటించారు. పైలట్ గ్రామంగా ఎంపిక చేసిన మోదవలస పరిధిలోని అల్లుపేటలో నిర్వహిస్తున్న రీసర్వేని పరిశీలించారు. రికార్డులను, మ్యాప్‌లను తనిఖీ చేశారు. గ్రౌండ్ ట్రూతింగ్‌పై ఆరా తీశారు. రైతులు సమక్షంలోనే రీసర్వే నిర్వహించాలని సూచించారు. నిర్ణీత కాలవ్యవధిలోగా గ్రామంలో రీసర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో తాహసీల్దార్ పద్మావతి, సర్వే, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మించాలని ఎంపీపీ, సర్పంచ్‌కు వినతి

విశాలాంధ్ర-కొత్తవలస : కొత్తవలస మండల నాయి బ్రాహ్మణ సేవా సంఘ కమ్యూనిటీ హాల్ కు వెళ్లేందుకు బ్రిడ్జిను నిర్మించాలని ఎంపీపీ నీలం శెట్టి గోపమ్మను మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోనూ, కొత్తవలస మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామిని మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సంఘం సభ్యులు శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన నాయకులు బ్రిడ్జి నిర్మాణం సహకరిస్తామని సంఘ భవనం వద్దకు పంచాయతీరాజ్ డిఈ స్వామినాయుడుతో కలిసి పరిశీలించి, బ్రిడ్జి నిర్మాణం త్వరితగతిన ప్రారంభించాలని తెలిపార. ఎన్నోఏళ్లగా సంఘ భవనం వద్దకు వెళ్లేందుకు సరియైన రహదారి లేక స్మశాన వాటిక నుండే రాకపోకలు సాగిస్తున్న నాయి బ్రాహ్మణ సేవా సంఘ సభ్యుల, నాయకులు బ్రిడ్జి నిర్మిస్తామనడంతో ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తవలస మండల మాజీ ఎంపీపీ గొరపల్లి జయప్రకాష్, కొత్తవలస మేజర్ గ్రామపంచాయతీ వైస్ సర్పంచ్ పెనగంటి చెల్లయ్య,మాజీ వార్డు సభ్యుడు ఆదిరెడ్డి నాయుడు, కొత్తవలస నాయి బ్రాహ్మణ సేవా సంఘ గౌరవ అధ్యక్షులు తేలకరావు అప్పారావు, సంఘ అధ్యక్షులు వద్దాది శంకర్ రావు, ఉపాధ్యక్షులు ఆర్.వి.ఏ.జీ.ప్రసాద్, కోశాధికారి పట్నాల కృష్ణప్రసాద్, ఉప కార్యదర్శి తేలకరావు దేవుళ్ళు, మండల కన్వీనర్ తేలకరావు సుందర్రావు, సలహాదారు గోలజాపు గౌరి తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు రవాణా శాఖ నిభందనలు పాటించాలి

రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ ఇన్స్‌పెక్టర్ శివరాంగోపాల్

విశాలాంధ్ర-విజయనగరం రూరల్ : రోడ్డుపై వాహనాలను నడిపే వాహనదారులు రవాణాశాఖ సూచించిన నిభందనలు పాటించాలని రోడ్డురవాణాశాఖ బ్రేక్ ఇన్స్‌పెక్టర్ శివరాంగోపాల్ అన్నారు. వాహన తనిఖీలలో భాగంగా శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాలలో ఆయన పర్యటించి, ముఖ్యకూడళ్ళ లలో తనిఖీలు చేపట్టారు. వాహానాలకు తగిన కాగితాలు లేకపోతే జరిమానాలను విదించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలం చెల్లిన వాహనదారులు అర్హతలను బట్టి రెన్యువల్ చేయించుకోవాలన్నారు. పెద్ద పెద్ద శబ్దాలు వచ్చే సైలెన్సర్‌లను వినియోగించరాదన్నారు. లైసెన్స్ లేకుండా వాహానాలు నడపవద్దని, ముఖ్యంగా మైనర్‌లకు వాహనాలను ఇవ్వవద్దని సూచించారు.

నగర ప్రజలకు సురక్షిత నీరు అందిస్తున్నాం

నగర పాలక కమిషనర్ నల్లనయ్య

విశాలాంధ్ర-విజయనగరం : నగర ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించేందుకు అవసరమైన క్లోరిన్ పరీక్షలను విరివిగా చేపడుతున్నామని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. శుక్రవారం తోటపాలెం లో పంపిణీ జరుగుతున్న కుళాయి నీటిని ఆకస్మికంగా క్లోరిన్ పరీక్షలను ఆయన నిర్వహించారు. కుళాయి నీటిని పరీక్షించగా 0.5 గా నమోదయింది. దీంతో పంపిణీ జరుగుతున్న తాగునీరు సురక్షితంగా ఉన్నట్లు గుర్తించారు. వాస్తవానికి క్లోరిన్ కలిపిన నీరు పరీక్షించే సమయంలో 0.2 నుండి 2 పార్ట్స్ పర్ మిలియన్ గా నమోదైనట్లయితే అది సురక్షితమైన నీరుగా పరిగణిస్తారు. 0.2 కన్నా తక్కువ ఉన్న 2 కన్నా ఎక్కువగా నమోదు అయినా అది సురక్షితమైన నీరు కానిదిగా భావిస్తారు. అయితే ప్రతిరోజు నగరవ్యాప్తంగా 156 క్లోరిన్ నమూనా పరీక్షలను చేపడుతున్నారు. ఎమినిటీస్ కార్యదర్శులు,క్లోరిన్ ఆపరేటర్స్, ఫిట్టర్లు సంయుక్తంగా ఈ తరహా పరీక్షలను నిర్వహిస్తూ ఉంటారు. ప్రతి డివిజన్‌లో 3చోట్ల క్లోరిన్ పరీక్షలను నిర్వహిస్తున్నారు. అయితే ఈ పరీక్షలను 5 చోట్ల చేయాలని కమిషనర్ పల్లి నల్లనయ్య సిబ్బందికి ఆదేశించారు.నగరంలో 34 ఎలివేటెడ్ సర్వీస్ రిజర్వాయర్లు, 2 గ్రౌండ్ లెవెల్ సర్వీస్ రిజర్వాయర్లు మొత్తంగా 36 వాటర్ ట్యాంకులు ఉన్నాయి. ఈ వాటర్ ట్యాంకుల ద్వారా 27 యం.ఎల్.డి నీటిని పంపిణీ చేస్తున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ నగర వ్యాప్తంగా పంపిణీ జరుగుతున్న తాగునీటికి క్లోరిన్ పరీక్షలను ఎప్పటికప్పుడు నిర్వహిస్తున్నామన్నారు. ఏఈ, డిఈలు కూడా నమూనా పరీక్షల పర్యవేక్షణను చేపడుతున్నారన్నారు. ముషిడిపల్లి, నెల్లిమర్ల రిజర్వాయర్ నుండి నగర ప్రజలకు అవసరమైన తాగునీరు పంపిణీ జరుగుతుందన్నారు. ఈ వేసవిలో కూడా ఎక్కడా నీటికి ఇబ్బందులు లేకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలను తీసుకున్నామన్నారు. అయితే ప్రజలు తాగునీటిని వృధా చేయకుండా ప్రతి ఒక్కరు ఆన్ ఆఫ్ స్విచ్ లను విధిగా వినియోగించుకోవాలని సూచించారు.

ఎం.వీ.జీ.ఆర్ 27వ వార్షిక దినోత్సవ వేడుకల సందర్భంగా రక్తదాన శిబిరం

విశాలాంధ్ర-డెంకాడ : ఎం.వీ.జీ.ఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ 27వ వార్షిక దినోత్సవ వేడుకల్లో భాగంగా, ఎం.వీ.జీ.ఆర్-ఎన్.ఎస్.ఎస్ యూనిట్ క్యాంపస్లో స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ యూత్, ఎన్.వీ.ఎన్ బ్లడ్ బ్యాంక్, న్యూ లైఫ్ బ్లడ్ సెంటర్తో కలిసి స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని నిర్వహించింది. రక్తదాన శిబిరాన్ని డైరెక్టర్, ఎం.వీ.జీ.ఆర్ వీ.ఎస్. సీతారామరాజు సందర్శించి, శరీరంలో హిమోగ్లోబిన్ తక్కువగా ఉన్నందున ప్రతి నెలా రక్తాన్ని ఎక్కించాల్సిన తలసేమియా వ్యాధిగ్రస్తులకు స్వచ్ఛందంగా రక్తదానం చేసినందుకు విద్యార్థులు మరియు సిబ్బందిని అభినందించారు. విద్యార్థులు కూడా ఇలాంటి కార్యక్రమాల్లో విరివిగా పాల్గొని సేవా భావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు రక్తదాన శిబిరంలో ఉత్సాహంగా పాల్గొని 92 యూనిట్ల రక్తదానం చేసి విజయవంతం చేశారు. ఈకార్యక్రమంలో ఎం.వీ.జీ.ఆర్ ప్రిన్సిపాల్ డా. ఆర్ రమేష్, వైస్ ప్రిన్సిపాల్ డా. వై ఎం సి శేఖర్, డీన్ ప్లేస్మెంట్స్ డా. ఎం సునీల్ ప్రకాష్ మరియు ఎన్.ఎస్.ఎస్ మరియు ఎఫ్.వై.ఎఫ్.పీ కోఆర్డినేటర్ ఎన్.షణ్ముఖ రావు, సిబ్బంది, ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లు తగిలి గడ్డి ట్రాక్టర్ దగ్ధం

విశాలాంధ్ర-వేపాడ : మండలంలోని అరిగిపాలెం మలుపు వద్ద విద్యుత్ వైర్లు తగలడంతో నిప్పు అంటుకొని గడ్డి ట్రాక్టర్ దగ్ధమైంది.వేపాడ నుండి ట్రాక్టర్ పై పరిమితికి మించి వరిగడ్డి ఎక్కించి సోంపురం వైపు వెళ్తుండగా అరిగిపాలెం మలుపు వద్ద ట్రాక్టర్ పై ఉన్న గడ్డికి విద్యుత్ వైర్లు రాపిడి వలన మంటలు చెలరేగాయి.దీంతో ట్రాక్టర్ పై ఉన్న గడ్డికి నిప్పు అంటుకొని మంటలు చెలరేగాయి.దీంతో స్థానికులు ఆందోళన గురై శృంగవరపుకోట అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు.హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. డ్రైవర్ చాణిక్యంతో మంటలతో ఉన్న ట్రాక్టర్ను ఖాళీ స్థలానికి తరలించి లోడుతో ఉన్న గడ్డిని తిరగేశాడు.దీంతో ప్రమాదం తప్పింది. ఇటీవల కాలంలో ట్రాక్టర్, బొలెరో యజమానులు పరిమితికి మించి వరిగడ్డిని ఎక్కించి రవాణా చేస్తున్నారు. దీనివలన వెనక నుంచి వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గడ్డి ధూళి కంట్లో పడి ప్రమాదాలు గురై హాస్పిటల్ పాలవుతున్నారు.వరిగడ్డి అధిక లోడ్లు నివారించకపోతే ప్రమాదాలకు కొదవుండదని స్థానికులు వాహన చోధకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇ ప్పటికైనా పోలీసులు స్పందించి వరిగడ్డి వాహనాల రవాణాను పగటిపూట నిరోధించాలని కోరుతున్నారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి

ఉదయం 7 తర్వాతే ఫించను మొత్తాల పంపిణీ
వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి : కలెక్టర్‌లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్

విశాలాంధ్ర-విజయనగరం కంటోన్మెంట్ : వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా జిల్లా కలెక్టర్ లు అన్ని చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అన్ని జిల్లాల్లో వేసవిలో త్రాగునీటి సరఫరాకు వేసవి కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని చెప్పారు. తాగునీటి కొరత వల్ల తాగునీటి వనరులు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా కలెక్టర్లతో శుక్రవారం సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్ లు, జిల్లా స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్టీఆర్ భరోసా ఫించన్ మొత్తాల పంపిణీ, వేసవిలో త్రాగునీటి సరఫరా, వ్యాధుల నియంత్రణ, వివిధ ప్రభుత్వ శాఖలపై, పథకాలపై వివిధ మార్గాల్లో సేకరించిన ప్రజాభిప్రాయ సేకరణ నివేదికల ఆధారంగా జిల్లాల ర్యాంకింగ్, నియోజకవర్గాల్లో ఎం.ఎస్.ఎం.ఇ. పార్కుల ఏర్పాటుకు భూసేకరణ తదితర అంశాలపై సమీక్షించారు. ఎన్టీఆర్ భరోసా ఫించన్ మొత్తాల పంపిణీని ఉదయం 7 గంటల నుంచి ప్రారంభించి సాయంత్రం 5 గంటలకు పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు చెప్పారు. మార్చి నెల నుంచి ఇదే విధానంలో పంపిణీ చేపట్టాలని పేర్కొన్నారు. ఎం ఎస్.ఎం.ఇ. సర్వే కు ప్రాధాన్యత ఇచ్చి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్, జాయింట్ కలెక్టర్ ఎస్ సేతు మాధవన్, సిపిఓ పి.బాలాజీ, డి.ఆర్.డి.ఏ. ప్రాజెక్టు డైరెక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, తూర్పు ప్రాంత విద్యుత్ సంస్థ ఎస్.ఇ. లక్ష్మణ్ రావు, డి.పి.ఓ వేంకటేశ్వర రావు, డి.ఎస్.ఓ మధుసూదన రావు, డి.పి.టి.ఓ నారాయణ, జిల్లా పరిషత్ డిప్యూటీ సి.ఇ.ఓ వెంకటరామన్, గ్రామీణ నీటి సరఫరా ఎస్.ఇ. కవిత, ప్రజారోగ్య ఇంజనీరింగ్ ఈ.ఈ. జ్యోతి , మునిసిపల్ కమిషనర్ పి. నల్లనయ్య, క్షయ నియంత్రణ అధికారి రాణి, డి.ఎల్.డి.ఓ రోజా రమణి, పరిశ్రమల శాఖ ఏ.డి. తదితరులు పాల్గొన్నారు.

మూడు నమ్మకాలు అభివృద్ధికి అవరోధాలు

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్ : జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా గాంధీ బ్లడ్ డోనార్స్ క్లబ్ మరియు జన విజ్ఞాన వేదిక సంయుక్తంగా తిరుమల నర్సింగ్ కళాశాలలో మూఢనమ్మకాల నిర్మూలనలో యువత పాత్ర పై సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి వ్యవస్థాపక అధ్యక్షులు గాంధీ బ్లడ్ డోనర్స్ క్లబ్ అబ్దుల్ రవూఫ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ శాస్త్ర సాంకేతిక రంగాలలో ముందుకు వెళ్తున్నప్పటికీ ఇంకా గ్రామాలలో మూఢనమ్మకాలు ఉండటం చాలా బాధాకరమని అన్నారు. దెయ్యాలు, భూతాలు ఒట్టిదేనని మూఢనమ్మకాల అభివృద్ధికి అవరోధాలని అన్నారు. మూఢనమ్మకాలు మానవ సంబంధాలను దెబ్బతీస్తాయని అన్నారు. శాస్త్రీయ దృక్పథంతో పెరగాలని విద్యార్థులకు సూచించారు. అక్షరాస్యత సాధన ద్వారా మూఢనమ్మకాలు అరికట్టవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల బోధకులు ధనలక్ష్మి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి, హామీల అమలుకు దోహదపడే బడ్జెట్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : శాసనసభలో ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మూడు లక్షల కోట్లతో ప్రవేశపెట్టినబడ్జెట్ సంతృప్తికరంగా ఉందని జనసేన నేత గురాన అయ్యలు అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజామోదయోగ్యమైనదని ప్రశంసించారు. గత వైసీపీ ప్రభుత్వ బడ్జెట్ కొందరికి మాత్రమే లాభదాయకమైనదిగా ఉండేదన్నారు. వ్యవసాయరంగానికి పెద్దపీట వేశారన్నారు. సంక్షేమం, అభివృద్ధికి బడ్జెట్ కేటాయింపుల్లో ప్రాధాన్యం ఇచ్చేరన్నారు. ప్రధానంగా అధికారంలో కొచ్చేందుకు దోహదపడ్డ సూపర్ సిక్స్ పథకాలకు ఈ బడ్జెట్‌లో కేటాయింపులు చేయడం అభినందనీయమన్నారు. కరువు రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దేలా ఏపీ బడ్జెట్ కేటాయింపులు చేసేరన్నారు. ఆర్థిక లోటు ఉన్నా కూడా సంక్షేమ పథకాలకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు పోలవరం, అమరావతికి భారీ కేటాయింపులు చేయడం హర్షనీయమన్నారు.

చీపురుపల్లి : రాష్ట్ర పునర్నిర్మాణానికి పునాదిలా, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్ ఉందని విజయనగరం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్ అన్ని వర్గాలకూ ఆమోదయోగ్యంగా ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. రాష్ట్రం పూర్తి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ.. రూ.3,22,359 కోట్లతో ప్రభుత్వం బడ్జెట్ లో కేటాయింపులు చేసి, స్వర్ణాంధ్ర నిర్మాణానికి బాటలు వేసిందని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి, హామీల అమలుకు సమ ప్రాధాన్యం ఇచ్చినట్లు చెప్పారు. పేద, మధ్యతరగతి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ రైతు, మహిళల కొనుగోలు శక్తి పెరిగేలా రూపొందించారని ప్రశంసించారు. వ్యవసాయ, అనుబంధ రంగాలకు భారీ ఎత్తున నిధులు కేటాయించడం ద్వారా రైతాంగానికి వెన్నుదన్నుగా కూటమి ప్రభుత్వం నిలుస్తోందని తెలిపారు. గత ప్రభుత్వం సంక్షేమం పేరుతో నిధులు కేటాయించి, వివిధ పథకాలకు మళ్లించిందని.. నేడు ప్రజా ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ,మైనార్టీ సంక్షేమానికి పెద్ద ఎత్తున కేటాయింపులు చేయడం ద్వారా ఆయా వర్గాల్లో ఆనందం నింపిందని వెల్లడించారు. వైసీపీ చేసిన విధ్వంసాల నుంచి వ్యవస్థలను పునరుద్ధరిస్తూ అనేక సవాళ్లను, సంక్లిష్ట పరిస్థితులను అధిగమించి, రాష్ట్రాన్ని పునర్నిర్మించేలా బడ్జెట్ ను రూపొందించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు కిమిడి ధన్యవాదాలు తెలియజేశారు.

చీపురుపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజల కోర్కెలకు అద్దం పట్టేలా ఉందని మాజీ ఎమ్మెల్యే సివిల్ సప్లైస్ బోర్డు డైరెక్టర్ గద్దె బాబురావు అన్నారు. శుక్రవారం ఆయన స్వామి విలేకరులతో మాట్లాడారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలకు మేలు చేసే విధంగా ఉందన్నారు. సంక్షేమ అభివృద్ధి రెండు కళ్లుగా రెండింటిని సమాన దృక్పథంతో అభివృద్ధిపరిచే దిశగా ఈ బడ్జెట్ లో నిధులు కేటాయింపులు జరిగాయని ఆయన అన్నారు. గత ప్రభుత్వంలో వ్యక్తిగత దూషణలు. దౌర్జన్యం అరాచకాలు అవినీతి తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదు అన్నారు. ప్రభుత్వం పెట్టిన ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ చంద్రబాబు పనితనానికి నిదర్శనంగా ఉందన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి రాజధాని నిర్మాణానికి నిధులు కేటాయింపులు చేస్తూనే విద్య వైద్య రంగాలతో పాటు ప్రజలకు అవసరమైన వ్యవసాయ రంగానికి కూడా సముచిత స్థానం కల్పిస్తూ ప్రవేశపెట్టారని ఆయన కొనియాడారు. ఈరోజు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలకు ఆమోదయోగ్యముగా నిలిచిందన్నారు.

మెంటాడ : అన్ని వర్గాల వారికి న్యాయం చేకూరేలా సంక్షేమం అభివృద్ధి హామీల అమలకు ఇది సరైన బడ్జెట్ అని పేద ప్రజల ఆకాంక్ష మేరకు కూటమి ప్రభుత్వం సరైన బడ్జెట్ విడుదల చేసిందని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు చలుమూరి వెంకట్రావు అన్నారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ విడుదల చేసిన బడ్జెట్ పేద ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేది గా ఉందని ఆయన అన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ పేదల ఆశలను అభివృద్ధి వైపు మలిచే విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ బడ్జెట్ ఉందని అన్నారు అన్ని వర్గాల వారికి న్యాయం సమకూరుస్తూ ఎంతో కూర్పుతో బడ్జెట్ను విడుదల చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కట్టుబడి ఉన్నారని అన్నారు. అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేయాలని అసెంబ్లీ సాక్షిగా నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని అన్నారు. అభివృద్ధి సంక్షేమంతో పాటు హామీల అమలకు బడ్జెట్లో అధిక ప్రాధాన్యత ఇచ్చారని, రైతే ముందు అనే నినాదాన్ని బడ్జెట్ కేటాయింపుల ద్వారా ఆచరణలో చూపించారని పేర్కొన్నారు. గత ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కుదేలు చేస్తే కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగానికి కొత్త ఊపిరి బడ్జెట్ ద్వారా కేటాయింపుల ద్వారా అందించామని అన్నారు .అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలు బడ్జెట్ కేటాయింపులు కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. రాష్ట్రాన్ని సస్యశ్యామలంగా మార్చేలా జల వనరుల శాఖ కు అధిక ప్రాధాన్యత అధిక కేటాయింపుల ద్వారా అందించటం జరిగిందని మొత్తం బడ్జెట్లో దాదాపు 6% ఆరోగ్యం వైద్య, విద్యా శాఖలకు కేటాయించడం జరిగిందని తెలిపారు. బీసీలకు సంక్షేమానికి సబ్ ప్లాన్ ద్వారా బడ్జెట్లో పెద్దపేట వేశారని ఎస్సీ,ఎస్టీ మైనార్టీ వర్గాల అభ్యున్నతి అభివృద్ధికి బాటలు వేశారని, అభివృద్ధి ఫలాలు అందరికీ అందేలా కేటాయింపులు జరిగాయని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజాం : కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో సంక్షేమం, అభివృద్దే లక్ష్యంగా రూపకల్పన చేసిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో ఈ బడ్జెట్ ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ రూపుదిద్దారని మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ రాజాం నియోజకవర్గం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అసెంబ్లీ సమావేశం అనంతరం మీడియాతో పేర్కొన్నారు.అభివృద్ధి, సంక్షేమాన్ని సమతుల్యం చేసి బడ్జెట్ కేటాయింపులు జరియాగయన్నారు.రాష్ట్రంలో ఆర్థిక లోటు ఉన్నా, సంక్షేమ పథకాలను నెరవేర్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు.పేద, మధ్యతరగతి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్ ను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు.నేడు కూటమి ప్రభుత్వం సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. వైద్య, విద్యారంగం, మహిళల సంక్షేమం,శిశు సంక్షేమంతో పాటు రైతుల సంక్షేమానికి అధిక ప్రధాన్యం కల్పించి,అన్నదాత సుఖీభవ పథకానికి బడ్జెట్ లో రూ.6,300 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. ఎన్టీఆర్ భరోసా కోసం రూ.27,518 కోట్లు, తల్లికి వందనం కోసం రూ.9407 కోట్లు, అన్నదాత సుఖీభవకు రూ.6300 కోట్లు, పోలవరానికి రూ.6705 కోట్లు, బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల స్కాలర్ షిప్ ల కోసం రూ.3377 కోట్లు, ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ కోసం రూ.400 కోట్లు, రహదారుల నిర్మాణం కోసం రూ.4220 కోట్లు, విద్యుత్ శాఖకు 5.13600 కోట్లు కేటాయించారన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తున్నారని ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ అన్నారు.

వేపాడ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం శుక్రవారం ప్రవేశపెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్ అద్భుతంగా ఉందని ఇది ప్రజా అభివృద్ధి,సంక్షేమంతో పాటు హామీల అమలుకు బడ్జెట్‌లో ప్రాధాన్యత లభించిందని శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారి అన్నారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రవేశపెట్టిస 2025-26 పూర్తిస్థాయి బడ్జెట్ అన్ని పర్గాల ఆకాంక్షలను ప్రతిబింబిస్తోందని. రాష్ట్ర పునఃనిర్మాణం దిశగా రూ.3.22 లక్షల కోట్లతో అభివృద్ధి, సంక్షేమమే ఎజెండాగా బడ్జెట్ కేటాయింపులు కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని వివరించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అన్నదాత సుఖీభవ,తల్లికి వందనం పథకాలకు భారీ కేటాయింపులు చేయడం సంతోషదగ్గ విషయమన్నారు. వ్యవసాయశాఖ బడ్జెట్ రూ.48,340 కోట్లు కేటాయించడం ద్వారా ఇది రైతు పక్షపాత ప్రభుత్వమని నిరూపించిందన్నారు. వ్యవసాయంపై ప్రధానంగా ఆధారపడిన విజయనగరం జిల్లాలో లక్షలాదిమంది రైతులకు ఎంతో ఉపయోగ పడుతుందని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని సస్య శ్యామలంగా మార్చేలా జలవనరులశాఖకు,రూ.18,020 కోట్లు అధిక కేటాయింపులు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. బీసీల సంక్షేమానికి సబ్ ప్లాన్ ద్వారా బడ్జెట్ లో 23,260 కేటాయించడం సంతోషంగా ఉందన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల అభివృద్ధికి బాటలు వేశారని, ఆరోగ్యశాఖకు రూ.19,265 కోట్లు, పాఠశాల విద్యకు రూ.31,806 కోట్లు, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధికి రూ.18,848 కోట్లు, పురపాలన శాఖకు బడ్జెట్?లో రూ.13,862 కోట్లతో ప్రాధాన్యత ఇచ్చారని అన్నారు.అభివృద్ధి ఫలాలు అందరికీ అందేలా కేటాయింపులు చేయడం కూటమి ప్రభుత్వానికే సాధ్యమైందని కొనియాడారు.

పదోన్నతిపై పిహెచ్ సి వైద్యాధికారిణి ధరణి బదిలీ

స్వచ్ఛంద పదవీ విరమణలో ఎంఎల్ హెచ్ పి.కోమలి

ఘన సత్కారంతో వీడ్కోలు పలికిన ఆస్పత్రి సిబ్బంది

విశాలాంధ్ర-వేపాడ : మండల కేంద్రమైన వేపాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి ఏ.ధరణి పదోన్నతిపై బదిలీ కాగా వల్లంపూడి వెల్నెస్ సెంటర్ లో ఎంఎల్ హెచ్ పి వానపల్లి కోమలి స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు.ఈ మేరకు పదోన్నతిపై గుంటూరు మెడికల్ కళాశాలకు వెళ్తున్న వైద్యాధికారిణి ధరణిని శుక్రవారం ఆస్పత్రి సిబ్బంది నాలుగేళ్లుగా అందించిన సేవలను గుర్తు చేస్తూ ఘనంగా సన్మాన సత్కారాలు చేసారు. అలాగే ఎంఎల్ హెచ్ పి గా అందించిన సేవలను కీర్తిస్తూ కోమలిని కూడా ఆస్పత్రి సిబ్బంది ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా డాక్టర్ ధరణి మట్లాడుతూ ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యునిగా భాద్యతలు స్వీకరించే సమయంలో ఇక్కడ పనిచేస్తున్న సిహెచ్ ఓ రమేష్ బాబు అందించిన సహాయ సహకారాలు మరువలేనని, అలాగే సిబ్బంది కూడా విధుల్లో సహకరించారని కొనియాడారు. అలాగే రోగులకు సకాలంలో వైద్యసేవలు అందించేందుకు నిరంతరం కృషి చేయాలనీ కోరారు.ఈ సన్మాన సత్కార కార్యక్రమంలో 108,104 సిబ్బంది, ఆస్పత్రి సిబ్బంది, ఎం ఎల్ హెచ్ పి లు, ఏఎస్ ఎంలు తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాల అత్యంత దయనీయమ్మైన పరిస్థితిలో ఉంది : ఎస్ఎఫ్ఐ

విశాలాంధ్ర-శృంగవరపుకోట : మండలంలో లోని పోతనపల్లె సాయి రంగ. పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థుల సమస్యలు పరిష్కరించి కళాశాలలో విద్యార్థులు జాయిన్ అయ్యేటప్పుడు కల్పిస్తామన్న సౌకర్యాలు కల్పించాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్. వెంకటేష్, డి .రాము మాట్లాడుతూ. మండలంలోని పోతనపల్లి వద్ద గల సాయి రంగ పాలిటెక్నిక్ కళాశాల అత్యంత దయనీయమ్మైన పరిస్థితిలో ఉందని ఎస్ఎఫ్ఐ భావిస్తుందని ఎందుకంటే సుమారు సంవత్సరకాలం నుంచి ఈ కళాశాలకు నేమ్ బోర్డు కూడా పెట్టలేని పరిస్థితి ఏర్పడిందని కళాశాలలో సుమారు 300 నుంచి 400 మంది విద్యార్థులు ఉన్నప్పటికీ వారికి 20 నుండి 30 శాతం కూడా సిలబస్ పూర్తి చేయలేదని, హాస్టల్ ఫెసిలిటీస్ ఉందని విద్యార్థుల వద్ద వేలకవేలు ఫీజులు తీసుకొని గర్ల్స్, బాయ్స్ ను ఒకే క్యాంపస్లో హాస్టల్ నిర్వహించడం చట్ట విరుద్ధమని అంతేకాకుండా హాస్టల్కు కనీసం వాచ్మెన్ కూడా లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పాంప్లెట్లలో కళాశాలలో మంచి సౌకర్యాలు కల్పిస్తామని అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన జరిపిస్తామని గొప్పగా తెలిపి వాస్తవంగా అవేవీ ఉండవని రోజుకు ఒక గంట కూడా క్లాసులు నిర్వహించడం లేదని వారం రోజుల్లోగా యాజమాన్యం ఈ సమస్యలపై పరిష్కారం చూపకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చినబాబు, జిల్లా సహాయ కార్యదర్శి రమేష్, మండల కార్యదర్శి రమేష్, జగదీష్, అను, రత్న, అనిల్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

దబ్బిరాజుపేట హెచ్ఎం శంకర్రావు పదవీ విరమణ

శుభాకాంక్షలు తెలియజేసిన ఉపాధ్యాయ సిబ్బంది

విశాలాంధ్ర-వేపాడ : మండలంలోని దబ్బిరాజుపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎల్ఎఫ్ఎల్) ప్రధానోపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తూ పదవి విరమణ చేసిన రెడ్డి శంకర్రావుకు మండల విద్యాశాఖ అధికారులు ఎన్ నాగభూషణరావు పి బాల భాస్కరరావులతో పాటు సహసర ఉపాధ్యాయ సిబ్బంది శుక్రవారం హృదయపూర్వక పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు.అలాగే ఘన సన్మానం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ శంకర్రావు మాస్టారు పదవీ విరమణ విద్యార్థులకు తీరని లోటని ఆయన వృత్తిలో పాఠశాల అభివృద్ధికి విద్యార్థుల విద్యభ్యాసంపై ఎనలేని సేవలు అందించారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మండల విద్యాశాఖ అధికారులు అన్ని సంఘాల నాయుకులు ఉపాధ్యాయులు విద్యార్థులతల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుండి ఇంటర్ పరీక్షలు ప్రారంభం

పరీక్ష కేంద్రాలకు సమయానికి హాజరు కావాలి ఆర్ఐఓ మజ్జి ఆదినారాయణ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ఇంటర్మీడియట్ పరీక్షలు శనివారం నుండి ఈనెల 20వ తేదీ వరకు జరగనున్నాయి. దీనికి సంబంధించిన హాల్ టికెట్లను ఇప్పటికే వాట్సాప్ ఫోన్ నెంబర్ కి పంపించే విధంగా ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి మజ్జి ఆదినారాయణ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మొత్తం 66 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు వీటిలో శనివారం జరిగే మొదటి సంవత్సరం విద్యార్థులు 20,902, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 20,368 హాజరు కానున్నారని తెలిపారు జిల్లావ్యాప్తంగా మొత్తం మూడు ఫ్లయింగ్, ఆరు సిట్టింగ్ స్క్వాడ్లు ఎప్పటికప్పుడు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు నిర్దేశిత సమయంలోనే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, ఎలాంటి సాంకేతిక పరికరాలు, సెల్ ఫోన్స్ కు గానీ అనుమతులు

లేవని తెలిపారు. మారుమూల ప్రాంతాల నుండి పరీక్ష కేంద్రాలకు వచ్చే విద్యార్థులకు ఆర్టీసి బస్సులు ఏర్పాటు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా పరీక్షా కేంద్రాలలో తాగునీటి సౌకర్యం, ఇతర అత్యవసర సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. అదేవిధంగా అన్ని పరీక్ష కేంద్రాలలో సీసీ టీవీ పర్యవేక్షణలో జరుగుతాయని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ నిబంధన ఉంటుందన్నారు. విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.